తెలంగాణ పేపర్

తెలుగు దినపత్రిక

డొనాల్డ్ ట్రంప్‌కు కోర్టుల్లో గట్టి ఎదురుదెబ్బ

న్యూయార్క్, నవంబర్ 5, (న్యూస్ పల్స్): అమెరికాలో మధ్యంతర ఎన్నికల వేళ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు కోర్టుల్లో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కాలిఫోర్నియాలో సుమారు 20 వేల వివాదాస్పద మెయిల్ బ్యాలెట్లను పక్కన పెట్టాలన్న ట్రంప్ ప్రభుత్వ ప్రయత్నాన్ని న్యాయస్థానాలు అడ్డుకున్నాయి. చివరకు అమెరికా సుప్రీంకోర్టు కూడా ట్రంప్ అభ్యర్థనను తిరస్కరించింది. కాలిఫోర్నియాలో సుమారు 20 వేల మంది ఓటర్లు అమెరికా పౌరులు కాకపోవచ్చని ట్రంప్ ప్రభుత్వం అనుమానం వ్యక్తం చేసింది. వీరు ఓటు వేయడానికి అర్హులు కాదని అమెరికా న్యాయశాఖ ఆరోపించింది. ఈ ఓటర్లకు సంబంధించిన బ్యాలెట్లను వెంటనే పక్కన పెట్టాలని రాష్ట్ర ఎన్నికల అధికారులను కోరింది. ట్రంప్ సర్కార్ ఆరోపణలపై కాలి ఫోర్నియా ప్రభుత్వం అభ్యంతరం తెలిపింది. దీనికి కాలిఫోర్నియా పలు అంశాలను లేవనెత్తింది. ఇందులో..కాలిఫోర్నియాలో ఇప్పటికే ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోంది. లక్షలాది మంది ఓటర్లు తమ బ్యాలెట్లను తిరిగి పంపించారు. ట్రంప్ ప్రభుత్వం ఇచ్చిన జాబితాలో అనేక తప్పులున్నాయని కాలిఫోర్నియా అధికారులు వాదించారు.

హైదరాబాద్ సంపుటి: 14 సంచిక : 04 | సంపాదకులు : నస్రీన్ ఖాన్ | గురువారం, నవంబర్ 05, 2026 | పేజీలు : 8 వెల : రూ. 2/-

గతంలో నినాదాలకే పరిమితం మేం చేసి చూపించాం

పేదరిక నిర్మూలనపై ప్రధాని మోదీ



పుణె: "గతంలో పేదరికంపై యుద్ధమనేది నినాదాలకే పరిమితమైంది. కానీ... 12 ఏళ్ల ఎన్డీయే పాలనలో దేశంలో 50 కోట్ల మందిని కడు పేదరికం నుంచి బయటకు తీసుకొచ్చాం. ఇప్పుడు భారతావని పేదరికాన్ని పారదోలుతోంది" అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. తమ పాలనలో పట్టణాల మౌలిక వసతుల్లో భారీ పరివర్తన వచ్చిందని తెలిపారు. పేదల సాధికారత, సుపరిపాలన తమ ప్రభుత్వ ముఖ్య లక్షణాలని వెల్లడించారు. పుణెలో రూ.8,300 కోట్లతో నిర్మించిన మెట్రో పింక్ లైన్-3ని మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్సు ద్వారా ప్రారంభించారు. మరో రూ.21,800 కోట్లతో నిర్మించనున్న నాలుగు మెట్రో కారిడార్లకూ ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... "2014 నాటికి 248 కిలోమీటర్లున్న మెట్రో నెట్‌వర్క్ ప్రస్తుతం 1,200 కిలోమీటర్లకు చేరింది. మెరుగైన పట్టణ మౌలిక సదుపాయాలు దేశ ఆర్థిక వృద్ధిని వేగవంతం చేస్తాయి. 2014లో ప్రజలు ఎన్డీయేకు అధికారం కట్టబెట్టినప్పుడు పట్టణాల్లోని మధ్య తరగతికి సులభతర జీవనం, రవాణా సౌకర్యాలను కల్పించాలని తీర్మానించుకున్నాం. ఆ దిశగా సాగుతున్నాం" అని మోదీ వివరించారు.

రైతులు ఆందోళన చెందొద్దు

కరవు వల్ల నష్టపోతున్న రైతులను ఆదుకుంటామని ప్రధాని ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. దీపావళి సీజన్లో కరవు ప్రాంత రైతులను గుర్తుంచుకోవాలని, వారూ వండగను ఆనందంగా జరుపుకొనేలా చూడాలని దేశ ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. "రైతులూ.. ఆందోళన చెందొద్దు. మేమంతా మీ వెంటే ఉంటాం. ఈ సంక్షోభాన్ని సమష్టిగా ఎదుర్కొందాం" అని ప్రధాని పేర్కొన్నారు.

50శాతం మహిళలే..

పుణె పింక్‌లైన్ మెట్రో నిర్వహణలో 50శాతం మంది మహిళలే పని చేస్తున్నారని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ తెలిపారు. రైళ్ల ఆపరేటర్లలో 100 మంది మహిళలేనని వెల్లడించారు. నిర్మాణ సమయంలోనూ మహిళా ఇంజినీర్లు కీలక పాత్ర పోషించారని వివరించారు.

కేంద్ర ప్రభుత్వం 2017లో తీసుకొచ్చిన పబ్లిక్-ప్రైవేటు పార్టనర్‌షిప్ విధానంలో భాగంగా.. డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్ (డీబీఎఫ్‌వోటీ) పద్ధతిలో నిర్మించిన తొలి మెట్రో ఇదని ఫడణవీస్ తెలిపారు. టాటా రియాలిటీ, సీమెన్స్ సంస్థలు సంయుక్తంగా దీనిని పూర్తి చేశాయని వివరించారు.

పేదల విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్యం

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఆసుపత్రిని పరిశీలించి ఇంజినీర్లకు సూచనలిస్తున్న మంత్రి పొంగులేటి



కూసుమంచి, తిరుమలాయపాలెం, న్యూస్‌టుడే: సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేదలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించేందుకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. ఖమ్మం జిల్లా కూసుమంచి సమీపంలో చేపట్టిన వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణ పనులను కలెక్టర్ దివాకర టీఎస్‌తో కలిసి ఆయన మంగళవారం పరిశీలించారు. తిరుమలాయపాలెం మండలం దమ్మాయిగూడెంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా కూసుమంచిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో ధనిక పిల్లలకు కార్పొరేట్ పాఠశాలల్లో లభించే నాణ్యమైన విద్యను పేద విద్యార్థులకు ప్రభుత్వ విద్యాలయాల్లో అందిస్తున్నామని, కార్పొరేట్ ఆసుపత్రుల తరహాలో వైద్యాన్ని పేదలకు సమకూరుస్తున్నామని అన్నారు. పేదలకు మెరుగైన వైద్యం అందించే క్రమంలో రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో, అవసరమైన ప్రాంతాల్లో వంద పడకల ఆస్పత్రులను నిర్మిస్తున్నట్లు చెప్పారు. పేదలు ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకున్నా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు వివరించారు.

కాంగ్రెస్ గెలుపును ఆపటం ఎవరితరం కాదు

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంతోపాటు కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ గెలుపును ఆపటం ఎవరితరం కాదని, రాహుల్‌గాంధీ ప్రధాని కావటం ఖాయమని పొంగులేటి అన్నారు. తెలంగాణ నుంచి దిల్లీకి ఆర్ఆర్ ట్యాక్స్ వెళ్తుందని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై ఆధారాలతో ఫిర్యాదు చేసి ఏడాదవుతున్నా కేంద్రం చర్యలు తీసుకోలేదన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసిన టీజేఎస్ రాష్ట్ర కమిటీ



హుజురాబాద్: తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ కోదండరాం నాయకత్వంలో టీజేఎస్ రాష్ట్ర కమిటీ మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న పలు సమస్యలతో పాటు స్థానిక సమస్యలను చర్చించినట్లు తెలంగాణ జన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు ముక్కెర రాజు తెలిపారు. ఎల్నినో కారణంగా ఇబ్బంది పడుతున్న రైతులను ఆదుకోవాలని, విద్యార్థులకు రావాల్సిన ఫీజ్ రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని, ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, తెలంగాణ ఉద్యమకారుల కోసం తగిన సహాయక చర్యలను తీసుకోవాలని పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టుల నిర్మాణాన్ని పూర్తి చేయాలని, ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని, వారు ముఖ్యమంత్రిని కోరగా దానికి సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి అన్ని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ముక్కెర రాజు తెలిపారు.

ధైర్యముంటే 'సర్'పై చర్చకు రండి

విపక్షాలకు హోంమంత్రి అమిత్ షా సవాల్

మావోయిస్టుల జన్‌తానా సర్కార్‌కు రాహుల్ మద్దతిచ్చారని ధ్వజం



రాయ్‌పుర్: పార్లమెంటును ప్రత్యేకంగా సమావేశపరిచి ఓటరు జాబితాల సమగ్ర సవరణ (సర్) కసరత్తుపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు. ధైర్యముంటే ఈ చర్చలో పాల్గొనాలని విపక్షాలకు సవాల్ విసిరారు. రాయ్‌పుర్‌లో మంగళవారం నిర్వహించిన ఛత్తీస్‌గఢ్ రాజ్యోత్సవ్ ముగింపు కార్యక్రమంలో అమిత్ షా ప్రసంగించారు. "పార్లమెంటును సక్రమంగా నడవనివ్వండి. ప్రత్యేక సమావేశం నిర్వహణకు మేం సిద్ధం. దేశ ప్రజల ముందు సర్‌పై చర్చకు రండి. రాజ్యాంగ ప్రతిని చేతపట్టుకుని తిరిగితే దానికి మద్దతిచ్చినట్లు కాదు. ప్రవర్తన కూడా రాజ్యాంగబద్ధంగా ఉండాలి" అని రాహుల్‌ను ఉద్దేశించి పేర్కొన్నారు. చట్టానికి కట్టుబడి ఉన్న వారినే పౌరులుగా పరిగణించాలన్న స్పష్టమైన విధానం మోదీ ప్రభుత్వానికి ఉందని తెలిపారు. చట్టాన్ని ఉల్లంఘించే వాళ్లు బస్తర్‌లో ఉన్నా, కశ్మీర్‌లో ఉన్నా, ఈశాన్య భారత్‌లో ఉన్నా భద్రతా బలగాలు కఠినంగానే వ్యవహరిస్తాయని స్పష్టం చేశారు. కాంగ్రెస్, ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ నక్సలిజానికి, మావోయిస్టుల చట్టవిరుద్ధమైన జన్‌తానా సర్కార్‌కు మద్దతిచ్చారని ఆరోపించారు. ఇటీవల నమూనా పార్లమెంటును నిర్వహించడం ద్వారా చట్టసభలను పరిహసించారని ధ్వజమెత్తారు.

రైతులు అనుబంధ రంగాలపై దృష్టి సారించాలి: తుమ్మల



హైదరాబాద్: ఎల్‌నినో నేపథ్యంలో రైతులు పాడి పరిశ్రమ, చేపలు, కోళ్ల పెంపకం వంటి అనుబంధ రంగాలపై దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. "తెలంగాణలో వాతావరణ మార్పులు, ఎల్‌నినో వంటి ప్రతికూల పరిస్థితుల దృష్ట్యా రైతులు పంటల సాగుపై ముందస్తు ప్రణాళికతో వ్యవహరిస్తూ నష్టాలను అధిగమించాలి. పంటల వైవిధ్యంతోపాటు సమీకృత వ్యవసాయ విధానాలను అనుసరించాలి. సూక్ష్మ సేద్య పద్ధతుల ద్వారా ప్రతి నీటి బొట్టును సమర్థంగా ఉపయోగించుకోవాలి" అని సూచించారు. మురసు తుపాను నేపథ్యంలో రైతులు పంట కోతలను తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఆదర్శ రైతులను అభినందించారు.

మేం దేశ వ్యతిరేకులమా? కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ



దిల్లీ: ప్రధాని మోదీ లక్ష్యంగా కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ దూకుడు మరింత పెంచారు. దేశాన్ని అస్థిరపరిచేందుకు విపక్షాలు విదేశీ శక్తుల సాయం తీసుకుంటున్నాయన్న ఆరోపణపై బహిరంగ చర్చకు సోమవారం పిలుపునిచ్చిన ఆయన.. 24 గంటల్లోనే ప్రధానికి మరో సవాలు విసిరారు. ప్రతిపక్షాలు దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా పని చేస్తున్నాయన్న ఆరోపణపై తనతో బహిరంగ చర్చకు రావాలన్నారు. ఇందుకోసం మోదీని ఒప్పించాలని కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ, శివరాజ్‌సింగ్ చౌహాన్, ఉత్తర్ ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్‌లను రాహుల్ కోరారు. "మోదీజీ..భయపడకండి. మనిద్దరితో పాటు మీడియా కూడా అక్కడుంటుంది. టేబుల్‌కు చెరోవైపు కూర్చుందాం. మోహన్ భాగవత్ (ఆరెస్సెస్ అధినేత) సహా ఎవరినైనా మీకిష్టం వచ్చిన వ్యక్తిని జడ్జిగా ఉంచుకోండి" అని రాహుల్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. "మన చర్చలో ఆర్థిక వ్యవస్థ గురించి ప్రశ్నలు ఉంటాయి. అమెరికాతో ఒప్పందం హడావుడిగా ఎందుకు జరిగింది? క్యాబినెట్‌కు సమాచారం ఇవ్వకుండానే మీరు ఎందుకు దాన్ని కుదుర్చుకున్నారు? వాస్తవాలను వెలుగులోకి తీసుకొద్దాం. దీపావళి శుభాకాంక్షలు" అని రాహుల్ పేర్కొన్నారు. "ఉన్నత స్థాయి చర్చలు పరిణతి చెందిన వ్యక్తుల మధ్యే జరుగుతాయి" అంటూ రాహుల్‌ను కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఎద్దేవా చేశారు.

తెలంగాణ పవర్

సంపాదకీయం

గురువారం, నవంబర్ 05, 2026

భారత్ లో అంత పేదరికం తగ్గిందా...

దశాబ్ద కాలంలో ఆర్థిక, ఆర్థికేతర అంశాల్లో పేదరికాన్ని తగ్గించడంలో భారత్ గణనీయమైన పురోగతి సాధించిందని ప్రపంచ బ్యాంక్ నివేదిక తెలిపింది.ప్రపంచవ్యాప్తంగా అత్యంత వేగంగా పేదరికాన్ని తగ్గిస్తున్న దేశాల్లో భారత్ కూడా ఒకటని ఆ నివేదిక పేర్కొంది.'భారత్‌లో పేదరికం, సమానత్వం' పేరుతో ప్రపంచ బ్యాంక్ ఈ నివేదిక విడుదల చేసింది.దారిద్ర్య రేఖకు దిగువన అంటే రోజుకు 4.2డాలర్ల (సుమారు రూ. 399) కంటే తక్కువ ఆదాయంతో జీవిస్తున్న జనాభా శాతం 2011 నుంచి 2023 మధ్య 57.7 శాతం నుంచి 16.1 శాతానికి తగ్గింది" అని నివేదికలో ప్రపంచబ్యాంక్ తెలిపింది.ఈ కాలంలో 49.6 కోట్ల మంది ప్రజలు పేదరికం నుండి బయటపడ్డారు. అదే సమయంలో తీవ్ర పేదరికంలో అంటే రోజుకు 3 డాలర్ల (సుమారు రూ. 285)కంటే తక్కువ ఆదాయంతో నివసిస్తున్న జనాభా 27.1 శాతం నుంచి 2.6 శాతానికి తగ్గింది" అని వెల్లడించింది.భారత్‌లో పేదరికం తగ్గడం కొనసాగుతుందని, అయితే ఈ తగ్గుదల వేగం కొంత నెమ్మదించవచ్చని అంచనావేస్తున్నట్టు ప్రపంచ బ్యాంకు పేర్కొంది.రోజుకు రూ. 399 ఆదాయాన్నిదారిద్ర్య రేఖగా గుర్తిస్తే 2026లో 14.2 శాతంగా ఉన్నపేదరికం రేటు 2028 నాటికి 12.1 శాతానికి తగ్గవచ్చని అంచనావేసింది."ఆర్థికేతర ప్రమాణాల ఆధారంగా పేదరికాన్ని అంచనావేయడానికి ఆక్స్‌ఫర్డ్ పావర్టీ అండ్ హ్యూమన్ డెవలప్‌మెంట్ ఇనిషియేటివ్ (ఓపీహెచ్ఐ) రూపొందించిన మల్టిడైమన్షనల్ పావర్టీ ఇండెక్స్ (ఎంపీఐ) ఆధారంగా అంచనా వేస్తారు.2005-06లో పేదరికం రేటు 53.8 శాతంగా ఉండగా అది 2019-21 నాటికి 16.4 శాతానికి తగ్గింది. 2022-23లో ఈ రేటు 15.5 శాతంగా ఉందని ప్రపంచ బ్యాంకు బహుముఖ పేదరిక సూచీ తెలిపింది.భారత్‌లో పేదరికం తగ్గుతున్నప్పటికీ ఆర్థిక అసమానతలు పెరుగుతున్న సమస్య మాత్రం అలాగే ఉంది."నిజానికి ప్రజలెంత ఖర్చుచేస్తున్నారనేదాని ఆధారంగా అసమానతలను లెక్కిస్తే అవి చాలా తక్కువగా కనిపిస్తాయి. ఆదాయాలను పోల్చిచూస్తే అసమానత చాలా ఎక్కువగా ఉంటుంది" అని ఇండియాటుడే నిర్వహించిన కార్యక్రమంలో ఆర్థికవేత్త సంతోష్ మెహ్రోత్రా చెప్పారు."భారత్‌లో ప్రజల ఆదాయాలకు సంబంధించి అసలు సర్వేలే నిర్వహించడం లేదు. మన దేశంలో ఆర్థిక అసమానతలు చాలా తీవ్రమైన సమస్య. అది మరింత తీవ్రమైంది. మనం దీనిని నిర్లక్ష్యం చేయకూడదు" అని ఆయన అన్నారు.ప్రపంచబ్యాంక్ నివేదికలోని అంశాలను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్వాగతించారు. నివేదిక గణాంకాల్లోని సానుకూల అంశాలను సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్‌లో ఆమె ప్రస్తావించారు."ప్రజల వినియోగం గణనీయంగా పెరగడం, ముఖ్యంగా మహిళలకు ఉపాధి అవకాశాలు పెరగడం, ఆహార సబ్సిడీతో పాటు సామాజిక సంక్షేమ పథకాల విస్తరణ వంటివి పేదరికం తగ్గడానికి ప్రధాన కారణాలని ప్రపంచ బ్యాంకు గుర్తించింది" అని నిర్మలా సీతారామన్ అన్నారు."ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రభుత్వం నిరంతరం అమలుచేస్తున్న విధానపరమైన ప్రయత్నాలు స్పష్టమైన ఫలితాలను ఇస్తున్నాయి. దీంతో అందరికీ అభివృద్ధి ఫలాలు అందించే సమ్మిళిత వృద్ధికి, ప్రజలకు మరిన్ని ఆర్థిక అవకాశాలు కల్పించడానికి బలమైన పునాది ఏర్పడుతోంది" అని ఆమె విశ్లేషించారు.పేదరికం తగ్గినప్పటికీ కొన్ని వర్గాల కుటుంబాల్లో ఇప్పుడది ఎక్కువగా కనిపిస్తోందని ప్రపంచ బ్యాంక్ నివేదిక తెలిపింది.విద్యాస్థాయి తక్కువగా ఉన్నవాళ్లు, ఆస్తులు తక్కువగా ఉన్నవాళ్లు, స్థిరమైన ఉపాధి పొందే అవకాశాలు పరిమితంగా ఉన్నవాళ్లు, కుటుంబపోషణ భారం ఎక్కువగా ఉన్నవాళ్ల కుటుంబాల్లో పేదరికం ఎక్కువగా ఉందని ప్రపంచ బ్యాంకు నివేదిక పేర్కొంది.కూలీల వేతనాల మధ్య అసమానతలు ఇప్పటికీ చాలా ఎక్కువగా ఉన్నాయని నివేదిక తెలిపింది. 2023లో అత్యధిక వేతనాలు పొందుతున్న పది శాతం కార్మికుల సగటు వేతనం, అతి తక్కువ వేతనాలు పొందుతున్న 10 శాతం కార్మికుల సగటు వేతనం కంటే దాదాపు 13 రెట్లు ఎక్కువగా ఉంది" అని నివేదిక పేర్కొంది."కొన్ని ప్రత్యేక భౌగోళిక ప్రాంతాల్లో పేదరికం ఎక్కువగా ఉందని కూడా నివేదిక పేర్కొంది.చాలా రాష్ట్రాల్లో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడినప్పటికీ దేశంలోని మొత్తం పేద జనాభాలో సుమారు 57 శాతం జనాభా ఉత్తర ప్రదేశ్ నుంచి పశ్చిమ బెంగాల్ వరకు వరుసగా ఉన్న ప్రాంతాల్లోనే నివసిస్తోంది" అని నివేదిక పేర్కొంది.2017 నుంచి 2023 మధ్యకాలంలో ఉద్యోగాలు, ఉపాధి పొందుతున్నవాళ్ల సంఖ్య సుమారు 13.4 కోట్లు పెరిగిందని కూడా నివేదిక పేర్కొంది. పని చేసే వయసులో ఉన్న జనాభా పెరుగుదలతో పోలిస్తే ఉపాధి పొందుతున్న వారి సంఖ్య దాదాపు రెట్టింపు పెరిగింది. ఈ ఉపాధి పెరుగుదలలో ఎక్కువ భాగం గ్రామీణప్రాంతాల్లో మహిళలు జీతం వచ్చే పనుల్లో చేరడం వల్లే సాధ్యమైంది. దీనివల్ల కుటుంబంలో సంపాదించే సభ్యుల సంఖ్య పెరిగింది.అయితే యువతలో నిరుద్యోగం పెరిగిన విషయాన్ని కూడా ప్రపంచ బ్యాంక్ ప్రత్యేకంగా ప్రస్తావించింది.2026-27 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం నుంచి 2027-28 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం మధ్య యువతలో నిరుద్యోగ రేటు 14.6 శాతం నుంచి 15.9 శాతానికి పెరిగింది. ఈ ప్రభావం ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని యువతులపై ఎక్కువగా పడిందని నివేదిక తెలిపింది.అంతేకాకుండా ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకున్నతర్వాత లెక్కించే వాస్తవ వేతనాల్లో పెద్దగా మార్పులేదని నివేదిక పేర్కొంది. అదే సమయంలో ఉపాధి పెరిగినప్పటికీ ఎక్కువ ఉత్పాదకత లేని పనుల్లోనే ఈ పెరుగుదల ప్రధానంగా కనిపించిందని తెలిపింది.

- ఎడిటర్

పోలవరం-బనకచర్ల లింక్‌పై రేవంత్ సర్కార్ ద్వంద్వ వైఖరి



హైదరాబాద్, నవంబర్ 4, (న్యూస్ పల్స్) పోలవరం – బనకచర్ల లింక్ ప్రాజెక్టు విషయంలో తెలంగాణ ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నదీ జలాల వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టమైన విధానం లేదని, ఈ విషయం ఎన్‌డబ్ల్యూడీఏ సమావేశాలతో మరోసారి బహిర్గతమైందని ఆమె విమర్శించారు. ఎన్‌డబ్ల్యూడీఏ సమావేశాల్లో రాష్ట్ర అధికారులు గోదావరి – కావేరి నదుల అనుసంధానాన్ని సమ్మక్క సాగర్ నుంచి చేపట్టాలని కోరుతుంటే... మరోవైపు కేంద్ర హోంమంత్రి అధ్యక్షతన జరిగిన దక్షిణాది రాష్ట్రాల కౌన్సిల్ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి పోలవరం – బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు సమ్మతి తెలపడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని కవిత ఆరోపించారు. ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణ నీటి హక్కులకు తీవ్ర విఘాతం కలుగుతుందని, 2024లోనే తెలంగాణ జాగృతి తరఫున తాము దీనిని వ్యతిరేకించామని గుర్తుచేశారు. "రాష్ట్రానికి హక్కుగా దక్కాల్సిన 250 టీఎంసీల గోదావరి జలాలను సీఎం రేవంత్ రెడ్డి ఏపీ సీఎం చంద్రబాబుకు 'గురుదక్షిణ'గా చెల్లించుకుంటున్నారు" అని ఆమె సంచలన ఆరోపణలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఆమోదంతోనే ఏపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు విషయంలో ముందుకెళ్లేందుకు కేంద్రంపై ఒత్తిడి తెస్తోందని విమర్శించారు. ఇవ్వటికైనా ప్రభుత్వం పోల్మూరి పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణకు జరిగే నష్టాన్ని గుర్తించాలని కవిత హెచ్చరించారు. ఈ ప్రాజెక్టుపై కేంద్రం జరిపే అన్ని సంప్రదింపుల నుంచి తెలంగాణ తక్షణమే వైదొలగాలని, ప్రాజెక్టును అడ్డుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రధాని నరేంద్ర మోదీకి సీఎం వెంటనే లేఖ రాయాలని ఆమె డిమాండ్ చేశారు.

పరికి చెరువు చుట్టూ కంచె వేయడాన్ని స్వాగతిస్తున్నాం. సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్.



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, నవంబర్ 04, తెలంగాణ పవర్,ప్రతి నిధి.: జగద్గిరిగుట్ట, ఎల్లమ్మ బండ, గాజులరామారం, శ్రీనివాస్ నగర్ వరకు సుమారు 45 ఎకరాల్లో విస్తరించి ఉన్న పరికి చెరువును కాపాడాలని గత కొద్ది సంవత్సరాలుగా భారత కమ్యూనిస్టు పార్టీ మరియు కలిసి వచ్చిన ఇతర పార్టీల ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహించామని దానికి స్పందనగా గతంలో హైడ్రా కంచె వేస్తే అక్కడి కంచెను కూడా తొలగించి నిర్మాణాలు సాగుతున్నాయని తెలుసుకొని నేడు హైడ్రాధికారులు మరోసారి కంచి వేయడానికి రావడం హర్షించదగినదని నేడు సిపిఐ జగద్గిరిగుట్ట కార్యాలయం వద్ద అన్నారు. కానీ అక్కడ ఏర్పాటు అయినటువంటి కొన్ని ఇండ్లు గతంలో హైడ్రా కూల్చివేసినపటికి కబ్జాదారులు మరోసారి వాటిని నిర్మిస్తూ పక్క స్థలాలను కూడా సుమారు 20 నుంచి 30 లక్షలకు అమ్మి ప్రజలను మోసం చేస్తున్నారని ఇలా మోసపోయిన వారు గతంలో కొన్ని టీవీల ఎదురుగా కూడా చెప్పడం జరిగిందని అయినప్పటికీ అధికారులు దానిపైన క్షుణ్ణంగా పరిశీలించకపోవడం వల్లే కబ్జాదారులను శిక్షించకపోవడం వల్లే మళ్లీ ఇలాంటి కొత్త నిర్మాణాలు ఏర్పడుతున్నాయని ఇప్పటికైనా హైడ్రాధికారులు పట్టిష్టమైనటువంటి కంచెను ఏర్పాటు చేసి వాటిని తొలగించిన వారిని గుర్తించి శిక్షించాల్సిందిగా డిమాండ్ చేశారు. హైదరాబాదులో అనేక చెరువులను కాపాడి అందంగా తీర్చిదిద్దుతున్నటువంటి హైడ్రా పరికిచెరువును కూడా అందంగా తీర్చిదిద్దాలని అనేకసార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ పట్టించుకోకపోవడం జగద్గిరిగుట్ట వాసులకు అనేక అనుమానాలకు దారితీస్తుందని ఆ అనుమానాలను నివృత్తి చేసేలా నేడు హైడ్రాధికారులు కంచెను వేయాలని తద్వారా భవిష్యత్ తరాలకు నీతి అవనరాలను తీర్చిదిద్దుతున్నట్టు అవుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ ప్రజానాట్యమండలి గౌరవాధ్యక్షులు ప్రవీణ్ అధ్యక్షులు బాబు యువజన సంఘం కార్యదర్శి కీర్తిలు పాల్గొన్నారు.

మహిళా కండక్టర్ మృతి పట్ల ఉద్యోగుల సంతాపం



జహీరాబాద్ నవంబర్ 4: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు డిపోలో విధులు నిర్వహిస్తున్న మహిళా కండక్టర్ గుండ్ల ప్రవళిక గత నెల 25వ తేదీన మణుగూరు నుంచి భద్రాచలం వెళ్లే బస్సులో విధులు నిర్వహిస్తున్న సమయంలో టికెట్ ఛార్జీ, చిల్లర విషయంలో ప్రయాణికురాలితో జరిగిన వివాదంలో ఆమెను బస్సు నుంచి కిందకు తోసివేయడంతో దురదృష్టవశాత్తు బస్సు వెనుక చక్రాల కింద పడి తీవ్రంగా గాయపడింది. గత పది రోజులుగా మృత్యువుతో పోరాడుతూ ఆమె మృతి చెందడం అత్యంత హృదయవిదారకమైన సంఘటని స్థానిక కార్మికులు వాపోయారు. ప్రవళిక మృతి పట్ల జహీరాబాద్ డిపో ఉద్యోగులు సంతాపం ప్రకటించారు.

ప్రతి ఖాతాదారునికి ఓడీ సౌకర్యం కల్పించాలి

ప్రతి గ్రామంలో ఆర్థిక అక్షరాస్యత శిబిరాలు నిర్వహించాలి: కలెక్టర్ కోయ శ్రీ హర్ష



జిల్లాలో అర్హులైన ప్రతి బ్యాంకు ఖాతాదారునికి రూ. 10 వేల వరకు ఓవర్‌డ్రాఫ్ట్ (ఓడీ) సౌకర్యం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బ్యాంకర్లను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన డీసీసీ, డీఎల్ఆర్సీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూపే కార్డులను యాక్టివేట్ చేసుకొని ప్రమాద బీమా ప్రయోజనాలు పొందేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రతి గ్రామపంచాయతీలో ఆర్థిక అక్షరాస్యత శిబిరాలు నిర్వహించి, బీమా, పెన్షన్ పథకాలపై ప్రజలకు వివరించాలని సూచించారు. వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అరుణశ్రీ, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

ఖమ్మం జిల్లా గట్టె సెంటర్ నందు రక్తదాన శిబిరం ఘనంగా నిర్వహించారు...,...





అఖిల భారత అయ్యప్ప ప్రచార దీక్ష సమితి ఆధ్వర్యంలో, శ్రీ తాండ్ర రాంప్రసాద్ గురుస్వామి సమక్షంలో, బుధవారం రక్తదాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమానికి రాజ్య తండా గ్రామ సర్పంచ్ శ్రీమతి బానోతు పుష్పావతి నాగేశ్వరరావు, భరత్ కుమార్ పాల్గొని రక్తదాన శిబిరానికి తమ మద్దతు తెలిపారు.

ఈ సందర్భంగా రక్తదాతలను అభినందిస్తూ, రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చని తెలియజేశారు.

రక్తదానం ప్రాణదానం. సేవే మాధవ సేవ అని తెలియపరిచారు...

కేసీఆర్‌కు పేరు వస్తుందనే నీళ్లివ్వడం లేదు: వేముల ప్రశాంత్ రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 4, (న్యూస్ పల్స్) తెలంగాణ ప్రభుత్వంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ బాన్సువాడ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్నది కాలం తెచ్చిన కరవు కాదని, ఇది పూర్తిగా కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిపెట్టిన కరవని ఆయన విమర్శించారు. పలువురు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలతో కూడిన ప్రతినిధి బృందం భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌లోని మేడిగడ్డ బ్యారేజీని సందర్శించింది. ఈ సందర్భంగా బ్యారేజీ స్థితిగతులను, నీటి లభ్యతను వారు పరిశీలించారు.అనంతరం వేముల ప్రశాంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందన్న కుట్రతోనే కాంగ్రెస్ ప్రభుత్వం మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తిపోయడం లేదని ఆరోపించారు. బ్యారేజీ వద్ద పుష్కలంగా నీరు అందుబాటులో ఉన్నప్పటికీ, వాటిని ఉద్దేశపూర్వకంగా సముద్రం పాలు చేస్తున్నారని మండిపడ్డారు. నిత్యం సుమారు 22,000 క్యూసెక్కుల నీరు వృథాగా పోతోందని, ఈ నీటిని పంపింగ్ చేస్తే రైతుల పంటలను కాపాడవచ్చని ఆయన అన్నారు. బ్యారేజీ కూలిపోయిందని ప్రభుత్వం చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని, 85 పిల్లర్లు పటిష్ఠంగానే ఉన్నాయని ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి నీటిని ఎత్తిపోయకపోతే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలో పెద్ద ఎత్తున 'రైతు పోరుబాట' నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ పర్యటనలో మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, గంప గోవర్ధన్, జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీపీఎస్సీ గ్రూప్-1 కేసులో ఈడీ దూకుడు

మాజీ ఐపీఎస్ పీఎస్ఆర్ ఆంజనేయులు నివాసంలోనూ సోదాలు

మనీ లాండరింగ్ కోణంలో ఈడీ దర్యాప్తు

హైదరాబాద్,ఏపీపీఎస్సీ గ్రూప్-1 కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగింది. ఈ ఉదయం నుంచి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహిస్తోంది.ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఏపీపీఎస్సీ మాజీ కార్యదర్శి, మాజీ ఐపీఎస్ పీఎస్ఆర్ ఆంజనేయులు నివాసంతో పాటు హైదరాబాద్, సికింద్రాబాద్‌లోని పలు ప్రాంతాలు, మంగళగిరి సమీపంలోని హాయ్‌ల్యాండ్ రిసార్ట్ సహా మొత్తం ఏడు చోట్ల ఈ తనిఖీలు జరుగుతున్నాయి. ఆంజనేయులు, క్యామ్‌సైన్ మీడియా, ఇతర ప్రైవేట్ సంస్థల మధ్య జరిగిన ఆర్థిక లావాదేవీలపై ఈడీ అధికారులు దృష్టి సారించారు.గత ప్రభుత్వ హయాంలో 2018లో 169 గ్రూప్-1 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారు. 2020లో మెయిన్స్ పరీక్ష నిర్వహించారు. అయితే, జవాబు పత్రాల మూల్యాంకనంలో భారీగా అక్రమాలు జరిగాయని ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై విచారణ జరిపిన సిట్... మంగళగిరి వద్ద హాయ్‌ల్యాండ్ రిసార్ట్‌లో 84 రోజుల పాటు మూల్యాంకనం చేశారని, అర్హత లేని 66 మందితో జవాబు పత్రాలను దిద్దించారని తన నివేదికలో తేల్చింది.ఈ మూల్యాంకనం కోసం క్యామ్‌సైన్ మీడియాకు రూ. 1.14 కోట్లు, ఇతర సంస్థలకు రూ. 1.38 కోట్లు చెల్లించినట్టు సిట్ గుర్తించింది. ఈ నివేదిక ఆధారంగా 2025 ఏప్రిల్‌లో పోలీసులు కేసు నమోదు చేయగా, గతంలో పీఎస్ఆర్ ఆంజనేయులు, క్యామ్‌సైన్ మీడియా డైరెక్టర్‌ను అరెస్ట్ చేశారు. సిట్ దర్యాప్తు నివేదిక ఆధారంగానే, ఈడీ మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద కేసు నమోదు చేసి, తాజాగా సోదాలు చేపట్టింది.

షాద్ నగర్ నియోజకవర్గానికి డీకే అరుణ చేసింది ఏమిటి..?

షాద్ నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్ నిలదీత

ఎంపీ లేఖలు ఎక్కడ?.. ప్రొసీడింగ్స్ చూపగలరా?

ఫొటోల రాజకీయం తప్ప షాద్‌నగర్‌కు ఎంపీ అరుణ సాధించింది శూన్యం

షాద్‌నగర్ మీడియా సమావేశంలో కాంగ్రెస్ నేతలు

షాద్‌నగర్ ,పట్టణంలో ప్రతిపాదిత రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ ఘనత తమదేనంటూ బీజేపీ నాయకులు ఎంపీ డీకే అరుణకు కృతజ్ఞతలు చెప్పడం కేవలం ప్రచారార్భాటమేనని షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. అసలు ఈ ప్రాజెక్టు కోసం ఎంపీగా డీకే అరుణ అధికారికంగా చేసిన కృషి ఏంటో, ఎవరికి ప్రతిపాదనలు పంపారో, ఏ తేదీల్లో లేఖలు రాశారో ప్రజల ముందు ఆధారాలతో నిరూపించాలని ఆయన సవాల్ విసిరారు. స్థానిక [illegible]యర్ కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన విలేకరుల [illegible]వేశం నిర్వహించి మాట్లాడారు.అధికారిక యంత్రాంగం [illegible]ట్టబద్ధంగా జరుగుతోందని స్పష్టం చేశారు. భూసేకరణ [illegible]ర్డీవో కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్‌కు అధికారిక [illegible]ళ్లాయని, ఆపై కలెక్టర్ ద్వారా ఐడపీఆర్ (ఎడఖఖీ) [illegible] సమాచారం అందిందని తేదీలతో సహా సంబంధిత [illegible] పత్రాలను ఆయన మీడియాకు చూపించారు. ఈ [illegible]ఖ్లు, స్థలాలు కోల్పోతున్న నిర్వాసితులకు న్యాయం [illegible]రికి ఎంత పరిహారం (కాంపెన్సేషన్) అందించాలన్న [illegible]ఆర్డీవో కార్యాలయం ఆధ్వర్యంలో బాధితులతో ప్రత్యేక [illegible]ం కూడా నిర్వహించారని వివరించారు. కేంద్ర, రాష్ట్ర [illegible]భాగస్వామ్యంతో పనుల్లో జాప్యం జరిగే అవకాశం ఉ [illegible]ప్రాజెక్టు ప్రాముఖ్యత దృష్ట్యా రైల్వే విభాగమే స్వయంగా [illegible]ం నిధులతో ఈ నిర్మాణాన్ని పూర్తిచేయాలని [illegible]దని బాబర్ వెల్లడించారు.

తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రూ.3.5 లక్షల పరికరాల వితరణ



తమ తల్లిదండ్రులు సత్తమ్మ – – అంజయ్యల జ్ఞాపకార్థం రూ. 3.5 లక్షల విలువైన ఉపకరణాలకు అందజేసేందుకు ముందుకు వచ్చిన కరీంనగర్ ఆర్ కె ఆగ్రోస్ అధినేత మియాపురం నాగరాజు, రామకృష్ణలను ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అభినందించారు.

తల్లిదండ్రుల పేరిట నమాజానికి ఉపయోగపడే సేవాకార్యక్రమాలు నిర్వహించడం ప్రశంసనీయమని ఆయన అన్నారు. బుధవారం నాడు నాగరాజు సోదరులు మంత్రి నివాసంలో ఆయనను కలిసి తమ సేవా కార్యక్రమాల గురించి వివరించారు. కరీంనగర్ జిల్లా కొండయ్య వల్లి గ్రామపంచాయతీకి రూ. 1.5 లక్షల విలువైన పారిశుద్ధ్య పరికరాలను అందజేస్తున్నట్టు తెలిపారు. మంథని నియోజకవర్గం ముత్తారం కస్తూర్బా బాలికల వసతి గృహానికి రూ. 2 లక్షల విలువైన ఆటోమేటిక్ చపాతీల తయారీ యంత్రాన్ని బహుకరించనున్నట్టు వారు వెల్లడించారు.

ఈ యంత్రం ద్వారా గంటకు 500 చపాతీలను తయారు చేయవచ్చు.

కార్యక్రమంలో తెలంగాణ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ స్టేట్ అసిస్టెంట్ డైరెక్టర్ బర్ల రాజు, అడవి శ్రీరాంపూర్ ఉప సర్పంచ్ అనవేన హరిత తిరుపతిలు పాల్గొన్నారు.

17వ సదర్ సమ్మేళనానికి యాదవ సోదరులందరూ తరలిరావాలి

జెకే శేఖర్ యాదవ్ పిలుపు



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, నవంబర్ 04,తెలంగాణ పవర్,ప్రతి నిధి.: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని జగద్గిరిగుట్ట లాస్ట్ బస్ స్టాప్ సెంటర్‌లో ఈ నెల 15-11-2026, ఆదివారం సాయంత్రం 6:00 గంటలకు 17వ సదర్ సమ్మేళనం ఘనంగా నిర్వహించనున్నట్లు సదర్ సమ్మేళనం చైర్మన్ జెకే శేఖర్ యాదవ్ తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి నియోజకవర్గాలకు చెందిన యాదవ ఆత్మీయులు, యాదవ సోదరులందరూ ఈ సదర్ సమ్మేళనానికి పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఆర్థిక్, సింహం, గండి రాజు, బాలు, నాగరాజు, పాశం శ్రీకాంత్, దస్తగిరి, కృష్ణ, సంతోష్, మనీష్, వీరేష్, కుమార్ రాజు, వినోద్, తుకారం, మల్లేష్, రాకేష్ యాదవ్ తదితర యాదవ సోదరులు పాల్గొన్నారు.యాదవ ఐక్యత -- మన సంఘటిత శక్తి17వ సదర్ సమ్మేళనం విజయవంతం చేద్దాం!

పేద విద్యార్థులకు ఉచితంగా క్రీడా దుస్తుల పంపిణి



జహీరాబాద్ నవంబర్ 4: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని ఇండస్ యూనివర్సల్ పాఠశాల వ్యవస్థాపకులు ఆర్. లింగారెడ్డి పేర్కొన్నారు. బుధవారం సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం చిలేపల్లి ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 40 మంది విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఒక్కో విద్యార్థికి బుధవారం, శనివారం ధరించేందుకు రెండు జతల దుస్తులను అందజేశారు. భవిష్యత్తులోనూ పేద విద్యార్థులకు అండగా నిలుస్తూ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని లింగారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మల్లారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు సంగారెడ్డి, మాజీ ఎంపీటీసీ ఆఫీస్ పటేల్, నాయకులు కాసాల మైపాల్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, కే. భూపతి రెడ్డి, కుత్బుద్దీన్, ఆరిఫ్, సద్దాం, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జాతీయ వుషూ ఛాంపియన్‌షిప్‌లో జహీరాబాద్ విద్యార్థుల సత్తా



జహీరాబాద్ నవంబర్ 4: జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో జహీరాబాద్ పట్టణానికి చెందిన విద్యార్థులు తమ ప్రతిభతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైలో నిర్వహించిన 25వ జూనియర్ జాతీయ వుషూ ఛాంపియన్‌షిప్--2026లో జహీరాబాద్‌కు చెందిన వజ్ర వీర మార్షల్ ఆర్ట్స్ అకాడమీ క్రీడాకారులు శ్లోక్ సాగర్, ఉమా మహేశ్వరి తెలంగాణ రాష్ట్ర జట్టు తరఫున పాల్గొని తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించారు.ఈ పోటీల్లో శ్లోక్ సాగర్ 6.98 పాయింట్లు, ఉమా మహేశ్వరి 6.86 పాయింట్లు సాధించి ప్రతిభ కనబరిచారు. జాతీయ స్థాయి వేదికపై తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించడం ద్వారా జహీరాబాద్ పట్టణానికి ప్రత్యేక గుర్తింపుతీసుకొచ్చారు. చిన్న వయసులోనే క్రీడలపై ఆసక్తి పెంచుకుని, నిరంతర సాధనతో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.ఈ సందర్భంగా వజ్ర వీర మార్షల్ ఆర్ట్స్ అకాడమీ మాస్టర్లు శంకర్ సాగర్, సిద్ధా రెడ్డి, కోచ్ సంధ్య చౌహాన్ క్రీడాకారులను అభినందించారు.

ముస్లింల విద్యా ప్రమాణాలను మెరుగు పరిచేందుకు ఎంఐఎం కృషి

బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ కృషితోనే మైనారిటీ గురుకులాల అంకురార్పణ జరిగింది

సాలారే మిల్లత్ ఆల్ ఇన్ వన్ గైడ్స్ పంపిణీలో నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్



మానకొండూర్, నవంబర్ 04:- తెలంగాణ రాష్ట్రంలో ముస్లింల విద్యా ప్రమాణాలు పెంచేందుకు ఎంఐఎం పార్టీ విశేషంగా కృషి చేస్తుందని నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ అన్నారు. బుధవారం మానకొండూర్ ప్రభుత్వ ఉర్దూ మీడియం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సాలారే మిల్లత్ ఆల్ ఇన్ వన్ 2026 గైడ్స్ ను, ఎస్సెస్సీ చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. 8,9, 10వ తరగతి విద్యార్థులకు పెన్నులు, నోట్ బుక్స్ అందజేశారు. సిరిసిల్ల, గంభీరావుపేట, వేములవాడ ఎంఐఎం పార్టీ ప్రతినిధులకు, ఆయా ప్రాంతాల్లో విద్యార్థులకు పంపిణీ చేసేందుకు గైడ్స్ అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ మాట్లాడుతూ.. విద్యార్థులందరూ ముఖ్యంగా బాల, బాలికలు కష్టపడి చదివి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, జీవితంలో పదవ తరగతి వార్షిక పరీక్ష కీలకమని, ఈ పరీక్షలో ఉత్తీర్ణులు అవ్వడానికి సాలారే మిల్లత్ గైడ్ దోహదపడుతుందని అన్నారు. మాజీ ఎంపీ దివంగత సుల్తాన్ సలావుద్దీన్ ఓవైసీ భవిష్యత్ తరాలకు ఉన్నత విద్యను అందించాలనే సంకల్పంతో గత 26 సంవత్సరాల క్రితం ఆల్ ఇన్ వన్ గైడ్లను ఎంఐఎం పార్టీ తరఫున ఉచితంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అందజేస్తున్నట్లు, సాలారే మిల్లత్ తర్వాత, తమ అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ, శాసనసభ పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీలు తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో ఉర్దూను బ్రతికించడం కోసం ఉర్దూ మీడియం పాఠశాలల విద్యా ప్రమాణాలు పెంచడం కోసం, ముస్లింల విద్య అభివృద్ధి కోసం అమోఘమైనటువంటి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కరీంనగర్ జిల్లాలో కలిసికట్టుగా అనేకమైనటువంటి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడం దారుస్సలాం ఏర్పాటు చేసి, ప్రజా సమస్యల ప్రజల నుండి విజ్ఞప్తులను స్వీకరిస్తూ వారి సమస్యల పరిష్కారానికి దారి చూపడం అభినందనీయమన్నారు. ఎంఐఎం పార్టీ కరీంనగర్ జిల్లా శాఖ చేస్తున్న ప్రజా సేవలను స్ఫూర్తిగా తీసుకొవాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంఐఎం కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ.. తమ అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ, శాసనసభ పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీల సారథ్యంలో.. హైదరాబాద్ నగరవ్యాప్తంగా పేద ముస్లింల పిల్లలకు బాసటగా నిలవాలనే సంకల్పంతో కార్పొరేట్ స్థాయిలో 20పాఠశాలలను స్థాపించి, 20వేల మంది విద్యార్థులకు ప్రతి ఏటా విద్యను ఉచితంగా అందిస్తున్నటువంటి ఘనత వీరికి దక్కుతుందన్నారు. ముస్లిం యువత, చెడు వ్యసనాలను మాని, ఉన్నతమైనటువంటి చదువులు చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించి రాజకీయాల్లో రాణించాలని తమ అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ పిలుపునిచ్చారని గుర్తుచేశారు. సాలరే మిల్లత్ గైడ్స్ ను దివంగత సుల్తాన్ సలావుద్దీన్ నాడు భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా ఈవిద్యా ప్రణాళికను తయారు చేశారని ఆయన గొప్ప సంకల్పంతో నేడు ముస్లింలు క్రీడల్లో, ఉన్నత విద్యలో, సివిల్స్ ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్, గ్రూప్1 వంటి ఉద్యోగాల్లో, డాక్టర్లుగా, ఇంజనీర్లుగా , ఇటు రాజకీయాల్లో రాణిస్తున్నారని చెప్పారు. ఈకార్యక్రమంలో పార్టీ నాయకులు హాఫిజ్ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రీ, అహ్మద్ మొహియుద్దీన్ బాబుజానీ, మాజీ కార్పొరేటర్ ఆరిఫ్, అబ్దుల్ గఫ్ఫార్, మెరాజోద్దీన్, అబ్దుల్లా ఖాన్, ఫసియుద్దీన్ ఖాలీద్, షాకిర్ నహ్ది, సిరిసిల్ల నాయకులు పర్వేజ్, ముస్తఫా, ఇర్ఫాన్ ఖాన్, మానకొండూర్ మస్జిద్ మాజీ అధ్యక్షుడు సిరాజుద్దీన్ పాషా, ఖమరొద్దీన్ షబ్బీర్, ఎజాజ్ ఖురేషీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెగా వాట్ సోలార్ ప్లాంట్ గ్రిడ్‌కు విజయవంతంగా అనుసంధానం

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



పెద్దపల్లి జిల్లాలో సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఒక మెగావాట్ సామర్థ్యం గల సోలార్ ప్లాంట్‌ను విద్యుత్ గ్రిడ్‌కు విజయవంతంగా అనుసంధానం చేసినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.

రాష్ట్రంలోనే సహకార సంఘాల ఆధ్వర్యంలో నాలుగు సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసిన జిల్లాగా పెద్దపల్లి గుర్తింపు పొందిందని పేర్కొన్నారు.

బుధవారం పెద్దపల్లి మండలం రాఘవపూర్ గ్రామంలోని ట్రాన్స్‌కో కార్యాలయం, విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ఒక మెగావాట్ సామర్థ్యం గల సోలార్ ప్లాంట్ సింక్రనైజేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పరిశీలించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, సహకార సంఘాల ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లాలో ఒక్కొక్కటి ఒక మెగావాట్ సామర్థ్యంతో మొత్తం నాలుగు సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

రాష్ట్రంలోనే సహకార సంఘాల ద్వారా నాలుగు సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసిన జిల్లాగా పెద్దపల్లి నిలవడం గర్వకారణమని తెలిపారు.లి

ఈ సోలార్ ప్లాంట్ల ఏర్పాటు విజయవంతం కావడంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్), సిబ్బంది చేసిన సమష్టి కృషి ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు.

ఒక మెగావాట్ సామర్థ్యం గల సోలార్ ప్లాంట్ సింక్రనైజేషన్ ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందని, ఇకపై ప్రతిరోజూ విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని తెలిపారు.

ూలార్ ప్లాంట్లను అధికారికంగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, వచ్చే వారం ప్రభుత్వ విప్ శాసనసభ్యులు సమయం తీసుకొని రాఘవాపూర్ లో ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని కలెక్టర్ వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి శ్రీమాల, ట్రాన్స్‌కో ఎస్.ఈ. గంగాధర్, రెడ్ కో డి.యం.మనోహర్,టీజీఎన్‌పీడీసీఎల్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి యువజన సాంస్కృతిక పోటీల పోస్టర్ విడుదల చేసిన జిల్లా కలెక్టర్ శ్రీ హేమంత్ కేశవ్ పాటిల్ IAS



నాగర్ కర్నూల్ జిల్లా : ప్రతినిధి (తెలంగాణ పవర్)నవంబర్ -04: జిల్లా స్థాయి యువజన సాంస్కృతిక పోటిలు తేది:11-11-2026 నాడు ప్రజావాణి మీటింగ్ హాల్, కలెక్టర్ కార్యాలయం, కొల్లాపూర్ చౌరస్తా దగ్గర, నాగర్ కర్నూల్ నందు ఉదయం 09.00 గం.లకు ప్రారంభించబడును.

యువజన సర్వీసు శాఖ, నాగర్ కర్నూల్ జిల్లా ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువజనోత్సవాలు ఈ నెల 11న ప్రారంభమవుతాయని పోస్టర్ విడుదల చేసిన జిల్లా కలెక్టర్ శ్రీ హేమంత్ కేశవ్ పాటిల్ ూూూ., గారు, జిల్లా స్థాయి సాంస్కృతిక ఉత్సవాల క్రింద, అనేక అంశాలలో యువజనులకు పోటీలు నిర్వహించచున్నట్టు ఆయన వెల్లడించారు.

నాగర్ కర్నూలు జిల్లాకు సంబంధించిన కళాకారులైన యువతి యువకులకు ఈ క్రింది అంశాలలో పోటీలలో పాల్గొన్నాల్సి ఉంటుందన్నారు. ఇందులో ముఖ్యంగా జానపద నృత్యం -- సమూహం (ఖీశీశ్రీఎ ఱుఅఎవ +తీశీబజూ), జానపద పాట -- నమూహం (ఖీశీశ్రీఎ ూశీఅస్త్ర +తీశీబజూ), పేయింటింగ్(గ్రుఅత్అఅస్త్ర), నుకడ్ నాటాక్ (క్రూతీవమ్రీశ్రీుఎ) / చీబఎుఱు చీఘ్ఱుఎ), కవిత రచన (గ్రూశీవితీఎ ఔతీఅత్అఅస్త్ర) నందు ప్రతీ అంశంలో విజేతలను నిర్ణయించి మొదటి స్థానం పొందిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయటం జరుగుతుందన్నారు.

ఈ పోటీలో పాల్గొనే యువ కళాకారులు నాగర్ కర్నూల్ జిల్లాకు చెందిన వారై ఉండాలన్నారు. అలాగే, ఈ జిల్లా స్థాయి పోటీలు ప్రజావాణి మీటింగ్ హాల్, కలెక్టర్ కార్యాలయం, కొల్లాపూర్ చౌరస్తా దగ్గర, నాగర్ కర్నూల్ నందు ఉదయం 09.00 గం.ల నుండి జరుగుతాయన్నారు.

పోటీలలో పాల్గొనే యువతీ యువకులు వయస్సు పోటీ నిర్వహించు నాటికి 15 సంవత్సరాల నుండి 29 సంవత్సరాలలోపు ఉండాలని, పోటీలో పాల్గొనే అంశానికి సంబంధించిన సామగ్రిని సంబంధిత యువ కళాకారులు తమ వెంట తెచ్చుకోవాలన్నారు. జానపద నృత్యము బృందంలో 10 మంది సభ్యుల బృందం 5 నిమిషాల నుండి 10 నిమిషాల గరష్ట కాలపరిమితి మించకుండా ప్రదర్శించాల్సి ఉంటుందన్నారు. సిడీలను, పెన్ డ్రైవ్ల గాని అనుమతించబడవు. జానపద పాటల బృందం 10 మంది కంటే ఎక్కువ ఉండరాదన్నారు. రికార్డు చేయబడిన సిడీలను, పెన్ డ్రైవ్ల గాని అనుమతించబడవని కూడా ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమములో శ్రీ బి. చెన్నయ్య, అదనపు కలెక్టర్ (రెవెన్యూ), శ్రీ బి. దేవసహాయం, అదనపు కలెక్టర్ (ఎల్ .బి), డి. చంద్రశేఖర్ కలెక్టరేట్ ఎ.ఓ., మరియు జిల్లా యువజన మరియు క్రీడల కార్యాలయ సిబ్బంది పాల్గోనారు.

ఇతర పూర్తి వివరములకు సెల్ ఫోన్ నెం. 9493112095 మరియు 8341661832 లేదా నేరుగా జిల్లా యువజన మరియు క్రీడల కార్యాలయము, రూమ్ నెం.+1, ఐ.డి.ఓ.సి బిల్డింగ్, కలెక్టర్ కార్యాలయం, కొల్లాపూర్ చౌరస్తా దగ్గర, నాగర్ కర్నూల్ నందు సంప్రదించగలరు.

(శ్రీ వి. సీతారాం)

జిల్లా యువజన మరియుక్రీడల అధికారి (ఖీూజ) నాగర్ కర్నూల్ జిల్లా.

కండక్టర్ ప్రవళిక తల్లికి ఉద్యోగం..

రూ.10లక్షల పరిహారం.. ప్రయాణికురాలిపై హత్య కేసు!



హైదరాబాద్, ప్రయాణికురాలు నెట్టివేయడంతో ఆర్టీసీ బస్సు కిందపడి ప్రాణాలు కోల్పోయిన మణుగూరు ఆర్టీసీ డిపో మహిళా కండక్టర్ గుండ్ల ప్రవళిక కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.. బాధిత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. అలాగే ప్రవళిక తల్లికి ప్రభుత్వ ఉద్యోగం, కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఇక ఆర్టీసీ తీసుకున్న నిర్ణయం కారణంగా బ్యాంకు తరఫు నుంచి మరో రూ. కోటి వరకు ప్రమాద బీమా అందుతుందని వెల్లడించారు.హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రి మార్చురీ వద్ద ప్రవళిక పార్థివదేహానికి మంత్రి పొన్నం ప్రభాకర్ నివాళులర్పించారు. అనంతరం ఆమె తల్లిని పరామర్శించి కుటుంబానికి ప్రభుత్వం, ఆర్టీసీ అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రవళిక తల్లికి ఉద్యోగం, కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్థిక సాయం అందించడంతోపాటు కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని పేర్కొన్నారు.

ప్రయాణికురాలిపై హత్య కేసు

ఆర్టీసీ సిబ్బంది విధి నిర్వహణలో పొరపాటు చేస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని, అంతేతప్ప చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని పొన్నం ప్రభాకర్ సూచించారు. ఒక ప్రయాణికురాలు తోసేయడం వల్ల మహిళా కండక్టర్ ప్రాణాలు కోల్పోయి ఓ కుటుంబం రోడ్డున పడిందని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రవళిక మృతికి కారణమైన ప్రయాణికురాలిపై హత్య కేసు నమోదు చేసి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు.

వృథాగా పోతున్న రాంపురం పెద్ద చెరువు నీరు

షట్టర్ల మరమ్మతులు చేయించడంలో అధికారుల నిర్లక్ష్యం
నీటి వృథాపై రైతుల ఆవేదన

చుంచుపల్లి, నవంబర్ 04 : ఇటీవల కురుస్తున్న వర్షాలతో రాంపురం పెద్ద చెరువు నిండింది. అయితే చెరువు తూముకు సంబంధించిన షట్టర్లు మరమ్మతులు చేయకపోవడంతో విలువైన నీరు వృథాగా బయటకు పోతోంది. రానున్న రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందన్న ఆందోళనల నేపథ్యంలో చెరువులో చేరిన నీటిని జాగ్రత్తగా నిల్వ చేసుకోవాల్సిన సమయంలో ఇలా వృథాగా పోతుండడంపై రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రాంపురం పెద్ద చెరువు నీరు వృథాగా పోతుంది, తూము షట్టర్లు మరమ్మతులు చేయించాలని ఇరిగేషన్ శాఖ అధికారులతో పాటు సింగరేణి అధికారులకు పలుమార్లు విన్నవించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముందుగానే షట్టర్ల మరమ్మతులు చేపట్టి ఉంటే ప్రస్తుతం చెరువులో చేరిన నీటిని పూర్తిస్థాయిలో నిల్వ చేసుకునే అవకాశం ఉండేదని పేర్కొంటున్నారు.ఈ చెరువు ఆయకట్టు కింద సుమారు 200 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ప్రస్తుతం వృథాగా పోతున్న నీటిని నిల్వ చేసుకోగలిగితే రానున్న రబీ సీజన్‌లో ఆయకట్టు రైతులకు సాగునీటి అవసరాలు తీర్చే అవకాశం ఉండేదని రైతులు చెబుతున్నారు. కానీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా విలువైన నీరు వృథాగా పోతుండడంతో ఏం చేయాలో పాలుపోక తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఇరిగేషన్ శాఖ అధికారులు, సింగరేణి యాజమాన్యం స్పందించి పెద్ద చెరువు తూము షట్టర్లకు తక్షణమే మరమ్మతులు చేయించి నీరు వృథాగా పోకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



మున్నూరు కాపులకు అన్యాయం చేస్తే సహించేది లేదు : రాష్ట్ర కార్యదర్శి హెచ్చరిక

మంచిర్యాల అర్బన్ : మున్నూరు కాపుల హక్కుల ను కాలరాసే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యదర్శి గదే సత్యం రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం మంచిర్యాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రభుత్వ తీరుపై నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కుల సంఘాలకు కేటాయించిన భూములు, భవనాల నిర్వహణపై ప్రభుత్వ పెత్తనం చెల్లదని, బీసీల అభివృద్ధికి చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం వారి హక్కులను హరించేలా నిర్ణయాలు తీసుకోవడం సరికాదని ఆరోపించారు .హైదరాబాద్‌లోని కోకాపేటలో మున్నూరు కాపు సంఘ భవన నిర్మాణానికి గత ప్రభుత్వం ఐదు ఎకరాల భూమిని కేటాయించిందని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వం జీవో నంబర్ 19 ద్వారా రూ.5 కోట్లు మంజూరు చేయడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. అయితే అక్టోబర్ 29న విడుదల చేసిన జీవో నంబర్ 14 ద్వారా కుల సంఘాల భూములు, భవనాల నిర్వహణలో ప్రభుత్వ జోక్యానికి అవకాశం కల్పిస్తున్నారని ఆరోపించారు. సంఘాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే ఈ జీవోను ఎలాంటి షరతులు లేకుండా తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో మున్నూరు కాపుల జనాభా సుమారు 40 నుంచి 45 లక్షల వరకు ఉన్నప్పటికీ రాజకీయంగా తగిన ప్రాధాన్యం దక్కడం లేదని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర మంత్రివర్గంలో ఒక్క మున్నూరు కాపు నాయకుడికి కూడా అవకాశం కల్పించకపోవడం వివక్షకు నిదర్శనమని విమర్శించారు. బీసీ కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించి చేతులు దులుపుకొంటే సరిపోదని నాయకులు ప్రశ్నించారు. కనీసం కార్యాలయాలు, సిబ్బంది, నిధులు లేకుండా కార్పొరేషన్లు ఎలా పనిచేస్తాయని నిలదీశారు.

రేవంత్ మూడేళ్లలో రెండు పిల్లర్లకు మరమ్మత్తు చేయించలేకపోయారు : మాజీ మంత్రి జీవన్ రెడ్డి

హైదరాబాద్, మేడిగడ్డ మరమ్మతుల కోసం ఒత్తిడి పెరగగానే సీఎం రేవంత్ తుమ్మిడి హట్టిపై నిద్రలేచినట్టు నటిస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ ఎస్ ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మహారాష్ట్ర సీఎంతో 3 నెలలు అపాయింట్‌మెంట్ కోసం వృధా చేశారు. డీపీఆర్ లేకుండానే చర్చలకు ఎందుకు పోయారు.. ? కాలయాపన కోసమే ఇదంతా.. ముంపునకు సంబంధించి మహారాష్ట్ర జాయింట్ అకౌంట్‌లో డబ్బులు వేస్తారట .ఆశ్చర్యం కలుగుతోంది. ఎల్‌నినోపై దృష్టి పెట్టలేదు. కరువును ఎదుర్కొనే కార్యాచరణ లేదన్నారు.కన్నె పల్లి పంప్ హౌజ్ దగ్గర 20వేల క్యూసెక్కుల ప్రవాహం ఉంది. సీపీడబ్ల్యూఆర్ ఎస్ రిపోర్ట్‌ను పక్కన పెట్టారు. కాఫర్ డ్యామ్ నిర్మాణం చేయమని మొత్తుకుంటున్నా పట్టించుకోవడం లేదని జీవన్ రెడ్డి మండిపడ్డారు.. ఒక్క టీఎంసీ నీళ్లు ఎత్తిపోసుకునే అవకాశం ఉన్నా ప్రభుత్వం స్పందించడం లేదు.. తాత్కాలిక వ్యూహం కింద ఈ పనులు చేపట్టాలి.. శాశ్వత ప్రాతిపదికన మరమ్మత్తులకు ఇది అడ్డంకి కాదు.. అన్నారం సుందిళ్ల గోదావరి మీద ఉన్నాయి.. మేడిగడ్డ ప్రాణహిత మీద ఉంది .అన్నారం ,సుందిళ్ల సురక్షితంగా ఉన్నాయి. కన్నె పల్లి నీళు ఎత్తిపోసినా వాటికి నష్టం లేదు. 150 టీఎంసీ ల నీళ్లు ఎత్తిపోసే వీలున్నా ప్రభుత్వం మొద్దు నిద్రపోతోంది. రేవంత్ రెడ్డి ఏం చేస్తుండో ఆయనకే అర్థం కావడం లేదు. రేవంత్ రెడ్డి కి ఆర్ ఆర్ టాక్స్ మీద ఉన్న శ్రద్ధ నీళ్లు ఎత్తిపోయడంలో లేదని ఫైర్ అయ్యారు.తుమ్మల నాగేశ్వర రావు ఖమ్మం జిల్లాలో ఇసుక బస్తాలు అడ్డం పెట్టి నీళ్లను ఆపుతున్నారు. ఆ సోయి కన్నెపల్లి విషయం లో ఎందుకు లేదు. కరువు సహాయక చర్యలు శూన్యం. ప్రభుత్వం కేవలం ప్రకటనలకే పరిమితం అయ్యింది. సీఎం ,మంత్రులు తలో రకంగా మాట్లాడుతున్నారు. రైతు కూలీలకు ఆత్మీయ భరోసా సాయం ఏమైంది. జాబ్ కార్డులు ఉన్న వారికి 12 వేల రూపాయల చొప్పున సాయం చేయాలి. వినియోగ దారుల గురించి కూడా ఆలోచించాలి. నిత్యావసరాల ధరలు అదుపులో లేవు. శ్రీ రామ్ సాగర్ ప్రాజెక్టు నీళ్లను ఆన్ అండ్ ఆఫ్ లో విడుదల చేస్తారని మంత్రి తుమ్మలకు తెలియదా ? రేవంత్ రెడ్డి తెలంగాణకు శనిలా దాపురించాడడన్నారు.రేవంత్ రెడ్డి సీఎంగా ప్రమాణం చేసిన వెంటనే తుమ్మిడి హట్టి మొదలు పెట్టి ఉంటే ఈ పాటికి పూర్తి అయ్యేదిఆల్మట్టిపై కర్ణాటక అనుసరించిన వ్యూహాన్నే తుమ్మిడి హట్టిపై తెలంగాణ ప్రభుత్వం అనుసరించాలి. తుమ్మిడి హట్టికి 152 మీటర్ల వద్ద శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించాలి.. తర్వాత ఎంత ఒప్పందం కుదిరితే దానికి కట్టుబడాలన్నారు.మూడేళ్లు సీఎం రేవంత్ నిద్ర పోయారని.. కేసీఆర్ మూడేళ్లలోనే కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారు. రేవంత్ మూడేళ్లలో రెండు పిల్లర్లకు మరమ్మత్తు చేయించలేకపోయారని జీవన్ రెడ్డి అన్నారు. యాసంగి పంటపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. రైతు రేవంత్ కంటే పెద్ద ఆలోచనాపరుడు. కన్నె పల్లి పంప్ హౌజ్ ను తక్షణమే వాడుకుని రైతులను ఆదుకోవాలి. రైతు భరోసాపై ప్రభుత్వం ఏం చేయదలుచుకుందో చెప్పడం లేదు. కరువులో అన్ని వర్గాలకు భరోసా ఇవ్వాల్సిన భాద్యత కాంగ్రెస్ ప్రభుత్వం మీద ఉందన్నారు.



సిద్ధు స్టింగ్ వీడియో కేసులో కుమారస్వామి సహాయకుడి విచారణ

కర్ణాటక, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను లక్ష్యంగా చేసుకుంటూ స్టింగ్ వీడియోలను ప్రసారం చేసిన కేసులో కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి కార్యాలయంతో సంబంధం ఉన్న మీడియా కన్సల్టెంట్ ప్రజ్వల్ ప్రసాద్‌ను బెంగళూరు సెంట్రల్ క్రైం బ్రాంచ్ (సీసీబీ) సైబర్ క్రైం పోలీసులు ప్రశ్నించారు. ప్రసాద్ మంగళవారం సీసీబీ ప్రధాన కార్యాలయానికి వచ్చి పోలీసుల ముందు హాజరయ్యాడు. విచారణకు హాజరు కావాలని పోలీసులు అంతకుముందు అతనికి నోటీసు పంపారు. ముందస్తు బెయిల్ పొందడానికి ముందు నిందితుడు తప్పించుకోవడంతో పోలీసులు ఆ నోటీసులు జారీ చేశారు. స్టింగ్ వీడియోల కేసులో ప్రసాద్ పాత్రతో పాటు అతని వెనుక ఎవరు ఉన్నారో గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయడానికి ఉపయోగించిన మొబైల్ ఫోన్‌ను ఢిల్లీలో కొన్నారని, అక్కడే కుమారస్వామి అధికారిక నివాసంలో ప్రసాద్‌కు ఆ ఫోన్ ఇచ్చారని బెంగళూరు పోలీస్ కమిషనర్ సీమంత్ కుమార్ సింగ్ తెలిపారు. ఈ కేసులో ఇదివరకే అరెస్టయిన నిందితుడు రితేశ్ పాండే ఇచ్చిన వాంగ్మూలం ప్రకారం.. ప్రసాద్ సూచనల మేరకే మొబైల్ ఫోన్‌ను కొనుగోలు చేసి అప్పగించారని సింగ్ వెల్లడించారు. పాండే, వినోద్ శర్మ అనే వ్యక్తులు ఢిల్లీలోని కరోల్ బాగ్‌లోని ఓ దుకాణంలో ఆ ఫోన్‌ను కొని, మంత్రికి కేటాయించిన అధికారిక నివాసంలో ప్రసాద్‌కు అందజేశారని చెప్పారు.ఆ వీడియోలను అప్‌లోడ్ చేసిన కేసులో పాండేను గత నెల 24న అరెస్టు చేశారు. ఈ కేసులో అరెస్టయిన తొలి వ్యక్తి అతనే. బెంగళూరు సీసీబీ పోలీసులు ఢిల్లీలో అతడిని అదుపులోకి తీసుకుని విచారణ కోసం బెంగళూరుకు తరలించారు. కాగా.. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై తీవ్రమైన ఆరోపణలు చేస్తున్నట్లు ఉన్న రెండు వీడియోలు సెప్టెంబర్‌లో యూట్యూబ్‌లో అప్‌లోడ్ అయ్యాయి. ఆ వీడియోలపై సిద్ధరామయ్య కోర్టును ఆశ్రయించారు. వాటికి సంబంధించిన వార్తలను ప్రసారం చేయడం, ప్రచురించడం వంటివి చేయకుండా మీడియాను ఆదేశించాలని కోరారు. అంతేకాకుండా, ఆ వ్యవహారంపై దర్యాప్తు జరపాలని కోరుతూ పోలీసులకు ఆయన ఫిర్యాదు చేశారు.



నీట్ పీజీ ప్రవేశాల్లో ర్యాంకుల ఆధారంగా సీట్లు! .. 2027 నుంచి అమలుకు ప్రతిపాదన

నీట్ పీజీ, నీట్ సూపర్ స్పెషాలిటీ కోర్సుల్లో ప్రవేశాలకు 2027 నుంచి కొత్త విధానాన్ని అమలు చేసే అవకాశం ఉంది. ఆ కోర్సుల్లో ప్రవేశాల కోసం ప్రస్తుతం అమల్లో ఉన్న పర్సంటైల్ ఆధారిత అర్హత విధానానికి బదులుగా ర్యాంకుల ఆధారంగా మెరిట్ ప్రాతిపదికన ప్రవేశాలు కల్పించాలని 12 మంది సభ్యులతో కూడిన కమిటీ సిఫారసు చేసింది. ఈ మేరకు తాను రూపొందించిన నివేదికను ఆ కమిటీ ఈనెల 3న సుప్రీంకోర్టుకు సమర్పించింది. ఆ ప్రతిపాదనకు నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. 2027 నుంచి కొత్త విధానాన్ని అమలు చేయాలని ప్రతిపాదించినప్పటికీ, ఇందుకు సంబంధించిన పూర్తి విధివిధానాలను ఖరారు చేయాల్సి ఉంది.పీజీ మెడిసిన్‌లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు కనీస అర్హత ప్రమాణాలను తగ్గించడం సరికాదని కమిటీ స్పష్టం చేసింది. సీట్లు మిగిలిపోతున్నాయన్న ఒకేఒక్క కారణంతో ప్రవేశ అర్హత ప్రమాణాలకు పూర్తిగా రిలాక్సేషన్ ఇవ్వడం సరికాదని సూచించింది. అలాగే నాన్ క్లినికల్ పీజీ కోర్సుల ఫీజులను తగ్గించాలని, ప్రీ క్లినికల్, పారాక్లినికల్ విభాగాలను ఎంచుకునే అభ్యర్థులకు సర్వీస్ బాండ్ల నుంచి మినహాయింపు ఇవ్వాలని సిఫారసు చేసింది. కౌన్సెలింగ్‌లో జాప్యాన్ని నివారించడంతోపాటు, పీజీ మెడికల్ సీట్లు ఖాళీగా మిగిలిపోకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొంది. ఈ నివేదికపై తమ అభిప్రాయాలను సమర్పించేందుకు పిటిషనర్లకు సుప్రీంకోర్టు గడువు ఇచ్చింది. తదుపరి విచారణను వాయిదా వేసింది.కౌన్సెలింగ్ ప్రక్రియలో పీజీ మెడికల్ సీట్లు భారీగా మిగిలిపోతుండటంతో నీట్ పీజీ అర్హత కటాఫ్‌ను పలుమార్లు తగ్గించడంతో వివాదం మొదలైంది. 2023లో అన్ని కేటగిరిల అభ్యర్థులకు అర్హత పర్సంటైల్‌ను సున్నాకు తగ్గించారు. దీంతో నెగెటివ్ మార్కులు వచ్చిన వారికి కూడా కౌన్సెలింగ్‌లో పాల్గొనే అవకాశం వచ్చింది. 2024లోనూ కటాఫ్ తగ్గించారు. జనరల్, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 15 పర్సంటైల్, రిజర్వ్‌డ్ కేటగిరిలకు 10 పర్సంటైల్‌గా నిర్ణయించారు. 2025-26 ప్రవేశాల సమయంలోనూ ఇదే పరిస్థితి వచ్చింది. 2026 జనవరి 13న నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బీఈఎంఎస్) మూడో విడత నీట్ పీజీ కౌన్సెలింగ్ కోసం అర్హత కటాఫ్‌ను సవరించింది.జనరల్ కేటగిరి అభ్యర్థులకు 50 పర్సంటైల్ నుంచి 7 పర్సంటైల్‌కు, జనరల్ పీడబ్ల్యూడీ అభ్యర్థులకు 45 పర్సంటైల్ నుంచి 5 పర్సంటైల్‌కు తగ్గించింది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ అభ్యర్థులకు 40 పర్సంటైల్ నుంచి సున్నాకు కుదించింది. దీంతో నెగెటివ్ మార్కులు వచ్చిన అభ్యర్థులు కూడా కౌన్సెలింగ్‌లో పాల్గొనే అర్హత లభించింది. పీజీ మెడికల్ సీట్లు ఖాళీగా మిగిలిపోవడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. కటాఫ్ తగ్గింపు కారణంగా అదనంగా 95,913 మంది అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు అర్హత సాధించినట్లు సుప్రీంకోర్టుకు సమర్పించిన గణాంకాలు వెల్లడించాయి. అయితే, అర్హత ప్రమాణాలను ఇంత భారీగా తగ్గించడం వల్ల వైద్యవిద్య నాణ్యత దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేస్తూ పిటిషనర్లు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలోనే నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి, ప్రవేశాల విధానంపై సమగ్ర సమీక్ష చేపట్టారు.

బ్యాంక్ తరలించొద్దని గ్రామస్తుల ధర్నా

బ్యాంకు తరలింపు కోసం వేసిన టెండర్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్



అర్వపల్లి, నవంబర్ 04 : జాజిరెడ్డిగూడెం గ్రామంలో అనేక సంవత్సరాలుగా ప్రజలకు సేవలందిస్తున్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (గాఎ) శాఖను వేరే ప్రాంతానికి తరలించేందుకు చేస్తున్న ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం జాజిరెడ్డిగూడెంలో గ్రామ ప్రజలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ? 1985 నుండి జాజిరెడ్డిగూడెంలో కొనసాగుతున్న ఈ శాఖ ద్వారా గ్రామంలోని రైతులు, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు బ్యాంకింగ్ సేవలు పొందుతున్నారని తెలిపారు. బ్యాంకు శాఖను వేరే ప్రాంతానికి తరలిస్తే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకు తరలింపునకు సంబంధించి ఇప్పటికే వేసిన టెండర్లను తక్షణమే రద్దు చేయాలని, జాజిరెడ్డిగూడెం గ్రామంలోనే గాఎ బ్యాంకు శాఖను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రజల అవసరాలు, ఖాతాదారుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని బ్యాంకు అధికారులు నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రజల అభిప్రాయాలను పట్టించుకోకుండా బ్యాంకును తరలించేందుకు ప్రయత్నిస్తే గ్రామ ప్రజలందరినీ కలుపుకుని పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

రేవంత్ రెడ్డి మియాపూర్‌లో బ్రహ్మాండంగా అమరవీరులకు ఇండ్లు కట్టించు : కేటీఆర్



శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని హైదర్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దామోదర్ రెడ్డి తన అనుచరులతో కలిసి భారీగా బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెట్ కేటీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. మీరంతా రేవంత్ రెడ్డి మాటలు వింటా ఉన్నరు.. ఆయనే కదా ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టింది. తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇస్తా అన్నడు.. మరి ఇప్పుడు మియాపూర్‌లో జాగా వచ్చింది కదా.. రేవంత్ రెడ్డి నీకు చిత్తశుద్ధి ఉంటే ఆ భూముల్లో తెలంగాణ ఉద్యమంలో పని చేసినవాళ్లందరికీ జాగా ఇస్తావా..? గట్టిగా చప్పట్లతో ఆయనను అడగండి అని అన్నారు. హైదరాబాద్‌లోని పేదలందరికీ 100 ఎకరాల్లో మంచిగా టవర్స్ కట్టు.. అందరికీ పేదవాళ్లకు ఇండ్లు ఇయ్యి.. మేమున్నా వద్దంటున్నమా..? అన్నారు.నువ్వే అంటున్నవ్ కదా కేసీఆర్ అక్కడెక్కడో 75 కిలోమీటర్ల దూరంలో ఎర్రవెల్లి అనే ఊరిలో ఉన్నరు.. హైవే నుంచి లోపలికి 12 కిలోమీటర్ల లోపల ఉంటది.. అట్లాంటి ఎర్రవెల్లిలో కేసీఆర్ ఉంటున్నరన్న కోపంతో.. రాష్ట్ర రాజకీయాలకు అది కేంద్రబిందువైందన్న కోపం మీద అమర వీరులను తీసుకుపోయి ఎర్రవెల్లిలో కాలనీ కట్టిస్తడట రేవంత్ రెడ్డి.. మరి నేనడుగుతున్నా రేవంత్ రెడ్డిని ఎక్కడో ఎర్రవల్లిలో 80 కిలోమీటర్ల అవతల ఎందుకయ్యా..మియాపూర్‌లో బ్రహ్మాండంగా అమరవీరులకు ఇండ్లు కట్టియి.. మేమొద్దంటున్నమా..? అని కేటీఆర్ అన్నారు.మియాపూర్‌లో 550 ఎకరాల భూములు వస్తే అమ్మేస్తానని రేవంత్ రెడ్డి అంటున్నాడు. ఆ భూముల్లో 200 ఎకరాలు పేదలకు ఇండ్లు, 100 ఎకరాల్లో అమరవీరులకు, ఇంకో 100 ఎకరాలు ఉద్యమకారులకు, మిగతాది పిల్లలకు స్కూల్స్, కాలేజీలు కట్టించు.. మేము గొప్పగా స్వాగతిస్తామన్నారు.సంవత్సరం లోపల కేసీఆర్ మళ్లీ తిరిగి రాబోతున్నారు.. ఎవరైనా పారిశ్రామికవేత్తలు రేవంత్ రెడ్డి వేసే ఎంగిలి మెతుకులకు ఆశపడితే.. మీరు పోరపాటున హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ పేరుతో జరుగుతున్న (హిల్ట్ పీ) స్కాంలో భాగస్వాములైతే అనుభవించేది మీరు.. ఆ తర్వాత మమ్మల్ని అనొద్దు. మా ప్రభుత్వం ప్రజల దయతో, దేవుడి ఆశీర్వాదంతో తప్పకుండా వస్తది. వచ్చిన వెంటనే ఈ భూములన్నింటికి చెక్ పెడతమన్నారు.

అల్వాల్ రైతుబజార్ను తొలగించవద్దు

రైతుల జీవనోపాధిని కాపాడాలి
ఎంపి ఈటలకు రైతుల విన్నపం

మేడ్చల్,అల్వాల్ రైతుబజార్ను తొలగిస్తే 1,500 రైతు కుటుంబాలకు నష్టం కలుగుతుందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ను రైతులు కలిసారు. అల్వాల్ రైతుబజార్ను ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం కోసం తొలగించనున్న నేపథ్యంలో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతుబజార్పై ఆధారపడిన సుమారు 1,500 రైతు కుటుంబాల జీవనోపాధిని కాపాడాలని ఎంపీ ఈటల రాజేందర్కు వినతిపత్రం అందజేశారు. మేడ్చల్, సిద్దిపేట, మెదక్, నల్గొండ జిల్లాల గ్రామాల నుంచి రైతులు ఇక్కడికి కూరగాయలు తీసుకొస్తున్నారు. ప్రతిరోజూ సుమారు 1,000 నుంచి 1,500 మంది రైతులు, వివిధ ప్రాంతాల నుంచి కూరగాయల విక్రయాలకు వస్తున్నట్లు పేర్కొన్నారు. 1999 జనవరి 26 నుంచి సుమారు 26 ఏళ్లుగా రైతుబజార్ రైతులకు జీవనాధారంగా కొనసాగుతోందని తెలిపారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా రైతులు నేరుగా వినియోగదారులకు తక్కువ ధరలకు కూరగాయలు విక్రయిస్తున్నారని వివరించారు. రైతుబజార్ను తొలగించే పరిస్థితి ఉంటే అల్వాల్ పరిసర ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ స్థలం కేటాయించి రైతుల జీవనోపాధిని కాపాడాలని ఈటలను విజ్ఞప్తి చేశారు.

ఎడతెరిపి లేని వర్షాలు..

పొంగిపొర్లుతున్న వాగులు.. భద్రాద్రి జిల్లాలో జలమయమైన రహదారులు



ములకలపల్లి, నవంబర్ 4: మురసు తుఫాన్ ప్రభావంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలవ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ప్రధాన రహదారులు జలమయమవ్వగా.. లోతట్టు ప్రాంతాల్లోని పంట పొలాలు నీట మునిగాయి. పాల్వంచ నుంచి మాదారం మీదుగా అన్నపురెడ్డిపల్లి వెళ్లే ప్రధాన రహదారిపై సత్యంపేట గ్రామం వద్ద పాములేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. వంతెనపై నుంచి వరద నీరు పొంగిపొర్లుతుండటంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. మరోవైపు పాల్వంచ నుంచి దమ్మపేట వెళ్లే ప్రధాన రహదారిపై రాజుపేట శివారులో పాములేరు వాగుపై ఇటీవల కూలిన వంతెన పక్కన ఏర్పాటు చేసిన తాత్కాలిక అప్రోచ్ కూడా వరద ఉధృతికి కొట్టుకుపోయింది. దీంతో ఈ రెండు మార్గాల్లో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు భారీ వర్షాలతో మండలంలోని లోతట్టు ప్రాంతాల్లో సాగు చేస్తున్న వరి, మిర్చి, పుచ్చ, శనగ తదితర పంటలు నీట మునుగుతున్నాయి. ఇప్పటికే వర్షాలతో ఇబ్బందులు పడుతున్న రైతులకు తాజా వర్షాలు మరింత నష్టం కలిగించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు ఇలాగే కొనసాగితే పంటలు పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉందని ఆవేదన చెందుతున్నారు.

ట్రంప్‌కు సీవాలు విసురుతున్న జోన్ ఓసోఫ్..

జార్జియా నుంచి మళ్లీ గెలుపు!
- డెమోక్రాటిక్ జోన్ ఓసోఫ్ ఘన విజయం
- రిపబ్లికన్ ప్రత్యర్థి మైక్ కాలిన్స్‌పై గెలిచి రెండోసారి సెనేటర్‌గా ఎన్నిక
- ట్రంప్ గెలిచిన రాష్ట్రంలో కీలక సీటును నిలబెట్టుకున్న డెమోక్రాట్లు
- ఓసోఫ్ జాతీయ స్థాయిలో కీలక నేతగా ఎదుగుతున్నారని విశ్లేషణలు

జార్జియా,అమెరికా సెనేట్‌లో అత్యంత పిన్న వయస్కుడైన సభ్యుడిగా ఇప్పటికే చరిత్ర సృష్టించిన 39 ఏళ్ల జాన్ ఓసోఫ్ మరోసారి రికార్డులకెక్కారు. నిన్న జరిగిన అమెరికా మధ్యంతర ఎన్నికల్లో జార్జియా నుంచి మరోమారు ఘన విజయం సాధించి రిపబ్లికన్ల ఆశలు అడియాసలు చేశారు. తీవ్ర ఉత్కంఠ కలిగించిన ఈ పోరులో ఓసోఫ్.. తన సమీప రిపబ్లికన్ ప్రత్యర్థి మైక్ కాలిన్స్‌పై స్పష్టమైన ఆధిక్యంతో గెలుపొందారు. గత అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ ఆధిక్యం ప్రదర్శించిన జార్జియాలో ఓసోఫ్ విజయం సాధించి అత్యంత పిన్న వయస్కుడిగా, మొదటి మిలీనియల్‌గా రికార్డుకెక్కారు. దీంతో ఈసారి సెనేట్ సీటును ఎలాగైనా కైవసం చేసుకోవాలని రిపబ్లికన్లు సర్వశక్తులు ఒడ్డారు. కానీ, వారి వ్యూహాలకు గండి కొడుతూ ఓసోఫ్ తన స్థానాన్ని పదిలపరుచుకున్నారు. ఈ విజయంతో, సెనేట్‌లో మెజారిటీ కోసం పోరాడుతున్న డెమోక్రాట్లకు కీలకమైన ఊరట లభించింది. జార్జియాలోని రెండు సెనేట్ స్థానాలు ఇప్పుడు డెమోక్రాట్ల ఖాతాలోనే పదిలంగా ఉన్నాయి. ప్రచారంలో వ్యూహాత్మక పదును: ఓసోఫ్ విజయం వెనుక పక్కా ప్రణాళిక, వ్యూహాత్మక ప్రచారం ఉన్నాయి. ఓవైపు పెరుగుతున్న జీవన వ్యయం, ప్రభుత్వంలో నైతిక విలువల ఆవశ్యకతపై దృష్టి సారిస్తూనే, మరోవైపు అధ్యక్షుడు ట్రంప్ విధానాలపై విమర్శనాస్త్రాలు సంధించారు. ప్రచారం కోసం ఏకంగా 100 మిలియన్ డాలర్లకు పైగా రికార్డు స్థాయిలో నిధులు సమీకరించి, ప్రత్యర్థులను ఆర్థికంగానూ దెబ్బతీశారు. మరోపక్క ట్రంప్ మద్దతు ఉన్నప్పటికీ, రిపబ్లికన్ అభ్యర్థి మైక్ కాలిన్స్ నిధుల కొరత, గత వివాదాల కారణంగా వెనుకబడ్డారు. జాతీయ రాజకీయాల్లో కీలక శక్తిగా..: 2021లో సెనేటర్ రాఫెల్ వార్నాక్‌తో కలిసి జార్జియాలో డెమోక్రాటిక్ జెండా ఎగరేసిన ఓసోఫ్.. ఇప్పుడు తన సీటును నిలబెట్టుకోవడంతో పార్టీలో ఆయన పలుకుబడి మరింత పెరిగింది. ఆయన జాతీయ రాజకీయాల్లో కీలక శక్తిగా ఎదుగుతున్నారని, భవిష్యత్తులో డెమోక్రాటిక్ పార్టీలో ఉన్నత పదవులు చేపట్టే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అయితే, తాను పూర్తికాలం సెనేటర్‌గా ప్రజలకు సేవ చేస్తానని ఆసాఫ్ స్పష్టం చేశారు. ఓట్ల లెక్కింపు కొనసాగుతున్నప్పటికీ, ప్రధాన మీడియా సంస్థలన్నీ ఓసోఫ్ విజయాన్ని ఇప్పటికే ఖరారు చేశాయి.

డొనాల్డ్ ట్రంప్‌కు కోర్టుల్లో గట్టి ఎదురుదెబ్బ

న్యూయార్క్, నవంబర్ 5, (న్యూస్ పల్స్)అమెరికాలో మధ్యంతర ఎన్నికల వేళ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు కోర్టుల్లో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కాలిఫోర్నియాలో సుమారు 20 వేల వివాదాస్పద మెయిల్ బ్యాలెట్లను పక్కన పెట్టాలన్న ట్రంప్ ప్రభుత్వ ప్రయత్నాన్ని న్యాయస్థానాలు అడ్డుకున్నాయి. చివరకు అమెరికా

సుప్రీంకోర్టు కూడా ట్రంప్ అభ్యర్థనను తిరస్కరించింది.కాలిఫోర్నియాలో సుమారు 20 వేల మంది ఓటర్లు అమెరికా పౌరులు కాకపోవచ్చని ట్రంప్ ప్రభుత్వం అనుమానం వ్యక్తం చేసింది.వీరు ఓటు వేయడానికి అర్హులు కాదని అమెరికా న్యాయశాఖ ఆరోపించింది.ఈ ఓటర్లకు సంబంధించిన బ్యాలెట్లను వెంటనే పక్కన పెట్టాలని రాష్ట్ర ఎన్నికల అధికారులను కోరింది.ట్రంప్ సర్కార్ ఆరోపణలపై కాలి ఫోర్నియా ప్రభుత్వం అభ్యంతరం తెలిపింది. దీనికి కాలిఫోర్నియా పలు అంశాలను లేవనెత్తింది. ఇందులో..కాలిఫోర్నియాలో ఇప్పటికే ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోంది.లక్షలాది మంది ఓటర్లు తమ బ్యాలెట్లను తిరిగి పంపించారు

అమెరికా మధ్యంతర ఎన్నికలు..

సత్తా చాటుతున్న భారత సంతతి అభ్యర్థులు
- అమెరికాలో కాంగ్రెస్‌పై పట్టు కోసం మధ్యంతర ఎన్నికలు
- కీలక పదవుల కోసం బరిలో నిలిచిన అనేకమంది భారత సంతతి నేతలు
- వర్జీనియా నుంచి ప్రతినిధుల సభకు సుహాస్ సుబ్రమణ్యం తిరిగి ఎన్నిక
- ఒహాయో గవర్నర్ రేసులో వెనుకంజలో వివేక్ రామస్వామి
- ఫ్లోరిడాలో పియా దండియా ఆధిక్యం.. పలుచోట్ల ఫలితాలపై ఉత్కంఠ

ఫ్లోరిడా,అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదవీకాలంలోని చివరి రెండేళ్లలో కాంగ్రెస్‌పై ఎవరికి పట్టు ఉంటుందో తేల్చే మధ్యంతర ఎన్నికల పోలింగ్ మంగళవారం ముగిసింది. దేశవ్యాప్తంగా ప్రతినిధుల సభలోని మొత్తం 435 స్థానాలకు, 100 మంది సభ్యులున్న సెనెట్‌లోని 37 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. వీటితో పాటు 36 రాష్ట్రాల్లో గవర్నర్ పదవులకు కూడా ఓటింగ్ నిర్వహించారు. ఈ ఎన్నికల్లో పెద్ద సంఖ్యలో భారత సంతతికి చెందిన అభ్యర్థులు కీలక పదవుల కోసం పోటీ పడుతుండటం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ఎన్నికల్లో భారత సంతతికి చెందిన డెమోక్రటిక్ నేత సుహాస్ సుబ్రమణ్యం ఘన విజయం సాధించారు. వర్జీనియాలోని 10వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ నుంచి పోటీ చేసిన ఆయన, 61 శాతానికి పైగా ఓట్లు సాధించి ప్రతినిధుల సభకు తిరిగి ఎన్నికయ్యారు. ఆయన ప్రత్యర్థి, రిపబ్లికన్ అభ్యర్థి డేవ్ బెక్‌విత్‌కు 36 శాతం ఓట్లు మాత్రమే పోలయ్యాయి. గతంలో బరాక్ ఒబామా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు వైట్‌హౌస్‌లో టెక్నాలజీ పాలసీ సలహాదారుగా సుహాస్ పనిచేశారు. అందరి దృష్టినీ ఆకర్షిస్తున్న ఒహాయో గవర్నర్ పదవికి రిపబ్లికన్ పార్టీ తరఫున పోటీ పడుతున్న భారత సంతతి వ్యాపారవేత్త వివేక్ రామస్వామి ప్రస్తుతం వెనుకంజలో ఉన్నారు. కేరళ మూలాలున్న వివేక్‌కు అధ్యక్షుడు ట్రంప్ మద్దతు ప్రకటించారు. తాజా సమాచారం ప్రకారం, ఆయన తన ప్రత్యర్థి, డెమోక్రటిక్ అభ్యర్థి అమీ యాక్టన్ కంటే దాదాపు 2,00,000 ఓట్ల వెనుకంజలో ఉన్నారు. మరోవైపు ఫ్లోరిడా 22వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ నుంచి డెమోక్రటిక్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న భారత సంతతి నేత మహిళ పియా దండియా ఆధిక్యంలో కొనసాగుతున్నారు. మాజీ హైస్కూల్ ప్రిన్సిపాల్ అయిన ఆమె, రిపబ్లికన్ అభ్యర్థి కేసీ అస్కర్‌పై దాదాపు 11,000 ఓట్ల ఆధిక్యంతో ముందంజలో ఉన్నారు. సిలికాన్ వ్యాలీలోని కొన్ని ప్రాంతాలున్న కాలిఫోర్నియా 17వ డిస్ట్రిక్ట్‌లో ఇద్దరు భారత సంతతి నేతల మధ్య ఆసక్తికర పోరు నెలకొంది. ఇక్కడ డెమోక్రటిక్ కాంగ్రెస్ సభ్యుడు రో ఖన్నాపై రిపబ్లికన్ నేత రితేష్ టాండన్ పోటీ చేస్తున్నారు. అలాగే వాషింగ్టన్‌లోని 7వ డిస్ట్రిక్ట్‌లో సిట్టింగ్ కాంగ్రెస్ సభ్యురాలు ప్రమీలా జయపాల్‌పై మరో భారత సంతతికి చెందిన రిపబ్లికన్ నేత నీరవ్ సేథ్ బరిలో ఉన్నారు. ఈ రెండు చోట్లా ఫలితాలు ఇంకా వెలువడలేదు. వీరితో పాటు సిట్టింగ్ కాంగ్రెస్ సభ్యుడు అమి బేరా (కాలిఫోర్నియా), అమిష్ షా (అరిజోనా), పూజా సేథి (టెక్సాస్), సందీప్ శ్రీవాస్తవ (టెక్సాస్) వంటి అనేకమంది భారత సంతతి అభ్యర్థులు వివిధ స్థానాల నుంచి పోటీ పడుతున్నారు. లాస్ ఏంజిల్స్ నగర మేయర్ పదవికి నిత్యా రామన్ పోటీ చేస్తున్నారు. ఆమె గెలిస్తే, అమెరికాలోని రెండు అతిపెద్ద నగరాలైన న్యూయార్క్, లాస్ ఏంజిల్స్‌కు భారత సంతతికి చెందినవారే మేయర్లుగా ఉంటారు. కొన్ని చోట్ల ఫలితాలు వెలువడినప్పటికీ, పలువురు కీలక భారత సంతతి అభ్యర్థుల భవితవ్యం తేలాల్సి ఉండటంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది.

సోషల్ మీడియాలో కాదు..

దమ్ముంటే సభలో చర్చకు రండి: రాహుల్‌కు నిర్మల సవాల్
మోదీ బహిరంగ చర్చకు రావాలన్న గాంధీ ఘాటుగా స్పందించిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్
చర్చలకు సరైన వేదిక పార్లమెంట్ అని స్పష్టీకరణ
సమాధానాలు వినకుండా సభ నుంచి వాకౌట్ చేయడంపై విమర్శలు
ఆధారాలతో చర్చకు వచ్చి, ప్రజాస్వామ్య సంస్థలను గౌరవించాలని సూచన





బహిరంగ చర్చకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ సిద్ధమా? అంటూ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విసిరిన సవాల్‌పై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు. చర్చలకు సరైన వేదిక పార్లమెంట్ అని, సోషల్ మీడియా కాదని తేల్చిచెప్పారు. ఈ మేరకు తన 'ఎక్స్' ఖాతాలో రాహుల్ గాంధీని ఉద్దేశించి ఆమె వరుస పోస్టులు చేశారు. "రాహుల్ జీ, చర్చకు వేదికను ఎంచుకోమని మీరు ప్రధానిని కోరుతున్నారు. దానికి ఇప్పటికే ఒక వేదిక ఉంది, అదే పార్లమెంట్. దానికి మీరే ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నారు" అని నిర్మల పేర్కొన్నారు. ఎలక్టోరల్ రోల్స్ ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్), ఈవీఎంల పనితీరుపై చర్చించేందుకు పార్లమెంటులో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేద్దామని హోంమంత్రి అమిత్ షా సోమవారమే ప్రతిపాదించిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు. "సోషల్ మీడియాలో సవాళ్లు విసిరినంత ఉత్సాహం పార్లమెంటులో చర్చకు ఎందుకు చూపించడం లేదు?" అని ఆమె ప్రశ్నించారు. ప్రభుత్వం సమాధానం చెప్పేందుకు ప్రయత్నించిన ప్రతిసారీ కాంగ్రెస్, ఇండియా కూటమి నేతలు సభ నుంచి వాకౌట్ చేస్తున్నారని నిర్మలా సీతారామన్ ఆరోపించారు. "సమాధానాలు డిమాండ్ చేసేటప్పుడు, వాటిని వినే బాధ్యత కూడా ఉంటుంది. ఎన్నోసార్లు మీరు, మీ పార్టీ సభ్యులు ప్రభుత్వం స్పందిస్తున్న సమయంలోనే సభ నుంచి వాకౌట్ చేశారు. అలాంటప్పుడు చర్చకు అంత ఆసక్తిగా ఉన్నామని ఎలా చెప్పుకుంటారు?" అని ఆమె నిలదీశారు. ప్రతిపక్షాల ఆందోళనలతో పార్లమెంట్ సమావేశాలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోతున్నాయని ఆమె విమర్శించారు. "మీకు చర్చపై నిజంగా అంత ఆసక్తి ఉంటే, ముందు పార్లమెంట్ కార్యకలాపాలు సజావుగా సాగేలా సహకరించవచ్చు కదా?" అని ప్రశ్నించారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నివాసంలో నిర్వహించిన "మాక్ పార్లమెంట్" కార్యక్రమాన్ని కూడా ఆమె తప్పుబట్టారు. అది "మాక్ పార్లమెంట్" కన్నా "పార్లమెంటును అపహాస్యం చేయడం"లా ఉందని ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం గురించి మాట్లాడేవారు ముందుగా ప్రజాస్వామ్య సంస్థలను గౌరవించాలని హితవు పలికారు. "'డరో మత్' (భయపడొద్దు) అని మీరు అంటుంటారు కదా. అలాంటప్పుడు వాస్తవాలతో, ఆధారాలతో సభకు రండి, విమర్శలను ఎదుర్కోండి, సమాధానాలు వినడానికి కూర్చోండి" అని రాహుల్ గాంధీకి నిర్మలా సీతారామన్ సవాల్ విసిరారు.

దిగొస్తున్న కూరగాయల ధరలు

హైదరాబాద్, నవంబర్ 4, (న్యూస్ పల్స్)తెలుగు రాష్ట్రాల్లో కూరగాయల ధరలు దిగొస్తున్నాయి. వంటిల్లో రోజూ ఉపయోగించే టమాటా, ఉల్లిపాయలు ధరలు అదుపులో ఉన్నాయి. మొన్నటివరకు వీటి ధరలు భగ్గుమనగా.. ప్రస్తుతం స్థిరంగా కొనసాగుతున్నాయి. దీపావళి పండుగ సీజన్ క్రమంలో ధరలు చౌకకే దొరకడంతో సామాన్యులు ఊరట చెందుతున్నారు. ఎల్‌నినో ప్రభావం వల్ల ఇటీవల ధరలు పెరిగాయి. కూరగాయలకు డిమాండ్ ఉండటంతో ధరలు పెరిగాయి. అయితే ఇప్పుడు పంట మార్కెట్‌కు వస్తుండటంతో సరఫరా పెరిగింది. ఈ కారణంతో ధరలు తగ్గుతూ వస్తున్నాయి. దీంతో ఈ పరిణామం పండుగ వేళ సామాన్యుల ఇంటి బడ్జెట్‌ను తగ్గిస్తోంది. పండుగ సమయాల్లో ఇంట్లో ఖర్చులు ఎక్కువగా ఉంటాయి. కిరాణా సరుకుల అవసరం ఎక్కువగా ఉంటుంది. ఇక రకరకాల వంటలు వడేందుకు కూరగాయల అవసరం ఎక్కువగా ఉంటుంది. ధరలు తగ్గడం పండక్కి ముందే ఊరటగా కల్గిస్తోంది.కూకట్‌పల్లి మోడ్రన్ అండ్ మోడల్ రైతు బజార్‌లోని నవంబర్ 3వ తేదీన కిలో టమాట రూ. 29, వంకాయ రూ. 18, బెండకాయ రూ. 45, పచ్చిమిర్చి రూ. 45, బజ్జి మిర్చి రూ. 60, కాకరకాయ రూ. 35, బీరకాయ రూ. 35, క్యాబేజీ రూ. 13, బీన్స్ రూ. 55, క్యారెట్ రూ. 43, గోబీపువ్వు రూ. 25, దొండకాయ రూ. 23, చిక్కుడుకాయ రూ. 45, గోరుచిక్కుడు రూ. 35, బీట్‌రూట్ రూ. 19కు విక్రయిస్తున్నారు. ఇఖ క్యాప్సికమ్ రూ. 45, బంగాళాదుంప రూ. 19, కీర (లోకల్) రూ. 23, కీర (ఇటాలియన్) రూ. 35, దోసకాయ రూ. 18, సొరకాయ రూ. 20, పొట్లకాయ రూ. 22 పలుకుతున్నాయి. అలాగే కిలో కంద రూ. 35, ఉల్లికాడలు రూ. 55, ఉల్లిగడ్డ రూ. 40, పచ్చి మామిడికాయ ఒక్కొక్కటి రూ. 15-20, అరటికాయ ఒక్కొక్కటి రూ. 9-10, చామగడ్డ రూ. 35, ముల్లంగి ఒక్కొక్కటి రూ. 6-8, చిలగడదుంప రూ. 35, గుమ్మడికాయ రూ. 25, నిమ్మకాయలు డజను రూ. 50-60కు లభిస్తున్నాయి. అలాగే మునగకాయలు ఒక్కొక్కటి రూ. 8-10, బొప్పాయి రూ. 50, పుట్టగొడుగులు (200 గ్రా.) రూ. 50, ఎండుమిర్చి రూ. 280, పాత అల్లం రూ. 180, కొత్త అల్లం రూ. 120, వెల్లుల్లి రూ. 260, చింతపండు రూ. 160, పండుమిర్చి రూ. 80, ఉసిరి రూ. 45, కరివేపాకు రూ. 80, పర్వల్ రూ. 28, పల్లికాయ రూ. 55, లోబియా రూ. 28, ఆగాకరకాయ కిలో రూ. 85గా ఉన్నాయి.విజయవాడలోని రైతు బజార్లలో కిలో టమాట రూ.39, బెండ రూ.24, పచ్చిమిర్చి రూ.34, కాకర రూ.34, క్యాబేజీ రూ.24, క్యారెట్ రూ.45, దొండ రూ.24, బంగాళదుంప రూ.25, ఉల్లిపాయలు రూ.39, గోరుచిక్కుళ్లు రూ.32, దోస రూ.20, చామదుంప రూ.34, అల్లం రూ.76, కంద రూ.34, బీట్ రూట్ రూ.36, కీరదోస రూ.46, బీన్స్ రూ.105, క్యాప్సికం రూ.60, చింతకాయలు రూ.100 పలుకుతున్నాయి



మధ్యంతర ఎన్నికల్లో ట్రంప్‌కు షాక్.. ఆధిక్యంలో డెమోక్రాట్లు

అమెరికాలో కొనసాగుతున్న మధ్యంతర ఎన్నికల ఓట్ల లెక్కింపు
తొలి ఫలితాల్లో డెమోక్రాట్లు ముందంజ, పలుచోట్ల ఆధిక్యం
జార్జియాలో డెమోక్రాట్ అభ్యర్థి జాన్ ఓసాఫ్ విజయం
ప్రతినిధుల సభ, సెనేట్‌పై పట్టు కోసం ఇరు పార్టీల తీవ్ర పోటీ
ట్రంప్ పాలనపై అసంతృప్తి, ధరల పెరుగుదల ఎన్నికలపై ప్రభావం

అమెరికాలో జరిగిన మధ్యంతర ఎన్నికల ఫలితాలు తీవ్ర ఉత్కంఠ రేపుతున్నాయి. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదవీకాలంలో 'కాంగ్రెస్'పై పట్టు ఎవరిదో తేల్చే ఈ ఎన్నికల్లో, తొలి ఫలితాలు డెమోక్రాటిక్ పార్టీకి అనుకూలంగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ప్రతినిధుల సభలో పలు కీలక స్థానాల్లో డెమోక్రాట్లు ఆధిక్యంలో ఉండటం రిపబ్లికన్ పార్టీలో ఆందోళన రేకెత్తిస్తోంది. నవంబర్ 3న జరిగిన ఈ ఎన్నికల్లో మొత్తం 435 ప్రతినిధుల సభ స్థానాలకు, 35 సెనేట్ స్థానాలకు, 36 గవర్నర్ పదవులకు పోలింగ్ జరిగింది. ఎన్నికలకు ముందు ప్రతినిధుల సభలో రిపబ్లికన్లకు స్వల్ప మెజారిటీ (సుమారు 218-214) ఉండగా, డెమోక్రాట్లు సభలో ఆధిక్యం సాధించాలంటే కేవలం మూడు సీట్లు అదనంగా గెలుచుకోవాల్సి ఉంది. అదేవిధంగా, 53-47 మెజారిటీతో రిపబ్లికన్ల ఆధీనంలో ఉన్న సెనేట్‌ను కైవసం చేసుకోవాలంటే డెమోక్రాట్లకు నాలుగు స్థానాలు అవసరం. ఓట్ల లెక్కింపు ప్రారంభమైన తర్వాత తూర్పు తీర రాష్ట్రాల నుంచి ఫలితాలు వెలువడటం మొదలైంది. జార్జియాలో డెమోక్రాటిక్ సెనేటర్ జాన్ ఓసాఫ్ తిరిగి ఎన్నికైనట్లు ప్రముఖ మీడియా సంస్థలు ప్రకటించాయి. ఇది డెమోక్రాటిక్ పార్టీకి కీలకమైన విజయంగా భావిస్తున్నారు. అంతేకాకుండా, ఫ్లోరిడాలోని కొన్ని రిపబ్లికన్ల ఆధీనంలో ఉన్న ప్రతినిధుల సభ స్థానాల్లో కూడా డెమోక్రాట్లు ఆధిక్యంలో కొనసాగుతుండటం గమనార్హం. ఈ ఎన్నికల్లో ఓటర్లపై జీవన వ్యయం పెరగడం, అవినీతి ఆరోపణలు, ట్రంప్ పరిపాలనపై ఉన్న అసంతృప్తి వంటి అంశాలు ప్రధాన ప్రభావం చూపినట్లు ప్రాథమిక విశ్లేషణలు చెబుతున్నాయి. సాధారణంగా అధ్యక్షుడి పార్టీ మధ్యంతర ఎన్నికల్లో సీట్లు కోల్పోవడం చారిత్రకంగా జరుగుతున్నప్పటికీ, ఈసారి ఫలితాలు ఎలా ఉంటాయోనని ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుతం ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది. ముఖ్యంగా హోరాహోరీగా ఉన్న నియోజకవర్గాల్లో తుది ఫలితాలు వెలువడటానికి కొన్ని రోజులు పట్టే అవకాశం ఉంది. పశ్చిమ రాష్ట్రాల ఫలితాలు వెలువడిన తర్వాతే 'కాంగ్రెస్'పై ఎవరిది పైచేయి అనేది స్పష్టమవుతుంది.

ఓట్ల చీలిక ఎవరికి దెబ్బ

లక్నో, నవంబర్ 5, (న్యూస్ పల్స్)యూపీలో భారతీయ జనతా పార్టీ రాజకీయ ఆధిపత్యానికి మునుపెన్నడూ లేనంతగా సవాళ్లు ఎదురవుతున్నాయి. జాతీయ భద్రత, బలమైన కేంద్ర నాయకత్వం ప్రధాన అజెండాగా సాగిన లోక్‌సభ ఎన్నికల్లోనే యూపీ ఓటర్లు బీజేపీకి ఊహించని షాక్ ఇవ్వడం పార్టీకి మేల్కొలుపుగా మారింది. దాదాపు దశాబ్ద కాలంగా అధికారంలో ఉన్న యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని డబుల్ ఇంజిన్ సర్కార్‌పై పాలనాపరమైన అసంతృప్తి క్షేత్రస్థాయిలో విస్తరిస్తోందన్న సంకేతాలు వెలువడుతున్నాయి. జాతీయ నినాదాలే పూర్తిస్థాయిలో ప్రభావం చూపలేకపోయిన తరుణంలో, పూర్తిగా స్థానిక, సామాజిక అంశాల చుట్టూ తిరిగే అసెంబ్లీ సమరంలో కమలనాథులకు పెను పరీక్ష తప్పేలా లేదు.యోగి ప్రభుత్వంపై పెరుగుతున్న అసంతృప్తికి ప్రధానంగా నిరుద్యోగం, ప్రభుత్వ ఉద్యోగ పరీక్షల పేపర్ లీకేజీలు, వ్యవసాయ సంక్షోభం, పెరిగిపోయిన ద్రవ్యోల్బణం వంటి క్షేత్రస్థాయి సమస్యలే ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. వీటికితోడు శాంతిభద్రతల పేరిట జరిగిన కొన్ని కఠిన చర్యలు, బుల్డోజర్ న్యాయం కొన్ని సామాజిక వర్గాల్లో భయాందోళనలను, వ్యతిరేకతను పెంచాయి. ముఖ్యంగా ఓబీసీ, దళిత వర్గాలలో ప్రభుత్వ ప్రాధాన్యతలపై తలెత్తిన అనుమానాలు బీజేపీ సాంప్రదాయ ఓటు బ్యాంకులో చీలిక తెచ్చాయి. మరోవైపు ప్రభుత్వ యంత్రాంగం , పార్టీ క్యాడర్ మధ్య సమన్వయ లోపం, మంత్రులు-ఉపముఖ్యమంత్రుల మధ్య తలెత్తిన అంతర్గత విభేదాలు కూడా పాలనపై ప్రభావం చూపుతున్నాయి.ఈ రాజకీయ శూన్యతను సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ అత్యంత చాకచక్యంగా తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. గతంలో ఉన్న కేవలం యాదవ-ముస్లిం సమీకరణ పరిధిని దాటి, ఆయన ప్రయోగించిన పీడీఏ వెనుకబడిన, దళిత, మైనారిటీ వర్గాలు సామాజిక ఫార్ములా క్షేత్రస్థాయిలో విస్తృత ఆదరణ పొందుతోంది.

జగన్ కు ఊపిరిచ్చిన ఎన్నికలు



అనంతపురం, నవంబర్ 4, ఆంధ్రప్రదేశ్ లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో జగన్ వ్యూహం ఒకరకంగా విజయవంతంమయినట్లేనని చెప్పాలి. ఎందుకంటే గత ఎన్నికల తరహాలో ఎన్నికలను బహిష్కరించకుండా క్యాడర్ లను, లీడర్లను ఎన్నికల బరిలోకి దింపడంతో ఒకరకంగా జగన్ సక్సెస్ అయినట్లే. తన క్యాడర్ ను పార్టీ జెండా పట్టుకుని వచ్చే సాధారణ ఎన్నికల వరకూ పోరాడగలిగేలా జగన్ ఈ ఎన్నికల ద్వారా సమాయత్తం చేయగలిగారు. నామినేషన్ల పర్వం నుంచి మొదలయిన రగడతో క్యాడర్ స్ట్రాంగ్ గా మారింది. ఎన్నికల ఫలితాల్లో గెలుపోటములతో సంబంధం లేకుండా, క్షేత్రస్థాయిలో పార్టీ ఉనికిని చాటుకోవడం మరియు క్యాడర్ను యాక్టివ్ చేయడంలో ఈ ఎన్నికలు కీలక పాత్ర పోషించాయని విశ్లేషకులు భావిస్తున్నారు. గత సాధారణ ఎన్నికల్లో వైసీపీ కేవలం పదకొండు స్థానాలకే పరిమితం కావడంతో క్యాడర్, లీడర్లలో నైరాశ్యం నిండుకుంది. కొందరయితే పార్టీని వీడి వెళుతున్న వారు, మరికొందరు తమ ఇళ్లకే పరిమితమయిన వారిలో ఫ్యాన్ పార్టీ ఉక్కపోతకు గురయిందని చెప్పాలి. అయితే స్థానిక సంస్థల ఎన్నికలను జగన్ చక్కగా వినియోగించుకున్నాడనిపిస్తోంది. స్తబ్దుగా ఉన్న క్యాడర్, లీడర్లలో ఆత్మస్థయిర్యం నింపింది. కొన్ని చోట్ల ప్రజలు వైసీపీకి పట్టం కట్టడంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం కూటమికి ఏకపక్షం కాదని ఈ ఎన్నికల ద్వారా జగన్ రుజువు చేసినట్లయింది. సార్వత్రిక ఎన్నికల ఓటమి తర్వాత స్తబ్దుగా ఉన్న పార్టీ శ్రేణుల్లో ఈ ఎన్నికలు కొత్త ఉత్సాహాన్ని నింపాయి. నాయకత్వం అండగా ఉంటుందనే నమ్మకాన్ని జగన్ కల్పించగలిగారు. పార్టీలోని అగ్రనాయకులు, ద్వితీయ శ్రేణి నాయకులు మరియు కార్యకర్తలు అంతా కలిసికట్టుగా పోరాడాల్సిన అవసరాన్ని ఈ ఎన్నికలు గుర్తుచేశాయి. దీనివల్ల అంతర్గత విభేదాలు పక్కన పెట్టి అందరూ ఏకమయ్యే పరిస్థితి వచ్చింది.? పోరాట పటిమను చాటడం: ఓటమిని చూసి కుంగిపోకుండా, అధికార పక్షాన్ని ఎదుర్కొంటూ ఎన్నికల బరిలో నిలవడం ద్వారా వైసీపీ తన ఉనికిని బలంగా చాటుకోగలిగింది. స్థానిక సంస్థల ఎన్నికల ద్వారా క్షేత్రస్థాయిలో పార్టీ యంత్రాంగాన్ని పునర్నిర్మించుకోవడానికి, లోపాలను సరిదిద్దుకోవడానికి జగన్‌కు ఒక మంచి అవకాశం లభించింది.రాజకీయాల్లో గెలుపు ఎంత ముఖ్యమో... ఓడినప్పుడు క్యాడర్ చేజారిపోకుండా కాపాడుకోవడం కూడా అంతే ముఖ్యం. ఆ కోణంలో చూస్తే, క్లిష్ట పరిస్థితుల్లో కూడా లీడర్లను, క్యాడర్‌ను ఏకతాటిపైకి తీసుకురావడంలో జగన్ వ్యూహం విజయవంతమైందని చెప్పవచ్చు.ఎన్నికల్లో ఓటమి ఎదురైనప్పటికీ, పార్టీ శ్రేణులు మరియు నాయకత్వం కలిసికట్టుగా ఉండటం జగన్ మోహన్ రెడ్డి సాధించిన విజయంగా కొందరు భావిస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై వైసీపీ అధినేత జగన్ ట్వీట్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో చంద్రబాబు టీమ్, పోలీసులు, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కు అభినందనలు తెలిపారు. నామినేషన్ల నుంచి పోలింగ్ వరకూ అంతా హైజాక్ చేశారని జగన్ ట్వీట్ లో పేర్కొన్నారు. ఇది ఎన్నిక కాదని... ఇది ఎన్నిక కాదని, అధికార పార్టీ ఎంపిక మాత్రమేనని వైఎస్ జగన్ అన్నారు. ప్రజలు అభ్యర్థులను ఎన్నుకోలేదని, ఎంపిక మాత్రమేనని అన్నారు. ప్రతిపక్షానికి పోటీ చేసే అవకాశమే దక్కినవ్వకుండా అధికార పార్టీ ఈ విజయాన్ని అందిపుచ్చుకుందని జగన్అన్నారు. ప్రతిపక్షానికి అవకాశమివ్వకుండా అధికారాన్ని చేజిక్కించుకోవడం ఎలాగో నిరూపించారు.క్లిష్ట సమయాల్లో కూడా క్షేత్రస్థాయిలో పార్టీ పట్టు కోల్పోకుండా, భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావడంలో నాయకత్వం విజయవంతమైందని ఈ వర్గం విశ్లేషిస్తుంది. భేదాభిప్రాయాలు మరియు సవాళ్లను ఎత్తిచూపే వాదన: మరోవైపు, ఎన్నికల తర్వాతి పరిణామాలలో కొందరు కీలక నాయకులు పార్టీని వీడటం లేదా క్రియాశీల రాజకీయాలకు దూరం కావడం వంటి అంశాలను మరికొందరు గుర్తుచేస్తున్నారు. పార్టీని తిరిగి బలోపేతం చేయడానికి మరియు క్యాడర్‌లో పూర్తిస్థాయి నమ్మకాన్ని నింపడానికి ఇంకా చాలా శ్రమించాల్సి
ఉందనే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

జగన్ ఇలాకాలో ఓటమి

కడప జిల్లాలో వైసీపీకి ఘోర పరాజయం దక్కింది. మొత్తం ఎనిమిది మున్సిపాలిటీల్లో వైసీపీ ఓటమి చవి చూసింది. ఉమ్మడి కడప జిల్లాలో దాదాపు అన్ని మున్సిపాలిటీల్లో వైసీపీ ఓటమి పాలయింది. బద్వేల్, రాజంపేట, మైదుకూరు, ప్రొద్దుటూరులో వైసీపీ ఓటమి చెందింది. అన్ని చోట్ల ఓటమి... కమలాపురం, జమ్మలమడుగు, యర్రగుంట్లలో వైసీపీకి పరాభవం ఎదురయింది. పులివెందుల మున్సిపాలిటీలోనూ వైసీపీకి ఘోర ఓటమి చవి చూసింది. మొత్తం మీద అన్ని చోట్ల పోటీ చేసిన వైసీపీకి ఘోర పరాభవం ఎదురు కావడాన్ని ఆ పార్టీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నారు.

ఏపీలో రాహుల్ ప్లాన్ ఏంటి



విజయవాడ, నవంబర్ 4, మొత్తం మీద కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఒక విషయంలో విజయం సాధించారు. ప్రధాని కాలేకపోయిన ఆయన విపక్షాలను ఏకతాటిపైకి తెచ్చి బలమైన ప్రతిపక్ష నాయకుడుగా మారారు. అది తాజాగా ఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో కళ్ళకు కట్టినట్లుగా కనిపించింది. రాహుల్ నాయకత్వం మీద మొదట్లో సందేహాలు వ్యక్తం చేసిన పార్టీలు కూడా భుజం కలిపి నడిచాయి. అంతా కలసి ఐక్యతను చాటాయి. దాంతో రాహుల్ కేంద్ర బిందువుగా మారారు. ఇక ఉత్తరాదిలో యూపీ నుంచి సమాజ్ వాది పార్టీతో కాంగ్రెస్ కి దోస్తీ ఉంది. అలాగే బీహార్ లో ఆర్జేడీతో పొత్తు ఉంది. పశ్చిమ బెంగాల్ లో మమతా బెనర్జీ ఓటమి తరువాత కాంగ్రెస్ తో మరింత సాన్నిహిత్యం నెరపుతున్నారు. మహారాష్ట్రలో ఉద్ధవ్ ఠాక్రే శివసేన మరో వైపు ఎన్సీపీ శరద్ పవార్ పార్టీతో చెలిమి చేస్తూ బలంగానే ఉంది. గుజరాత్ రాజస్థాన్, మధ్యప్రదేశ్ ఢిల్లీ పంజాబ్ వంటి చోట్ల కాంగ్రెస్ బలంగానే ఉంటూ తన పోరాటం సొంతంగా సాగిస్తోంది.ఇక దక్షిణాదిన మొదటి నుంచి కాంగ్రెస్ బలంగానే ఉంది. కర్ణాటక తెలంగాణాలలో సొంతంగానే అధికారంలోకి వచ్చింది. కేరళలో ఇటీవల పవర్ ని అందుకుంది. తమిళనాడులో ఆరు దశాబ్దాల తరువాత ప్రభుత్వంలో చేరింది. రెండు మంత్రి పదవులు కూడా తీసుకుంది. సినీ దళపతి విజయ్ స్థాపించిన టీవీకేతో కొత్త స్నేహం నెరిపి దక్షిణాదిన అయిదింట నాలుగు రాష్ట్రాలలో తన హవాను స్పష్టం చేస్తోంది. అన్నీ బాగానే ఉన్నా మొదటి నుంచి కాంగ్రెస్ కి పెట్టని కోటగా ఉన్న ఏపీని ఎందుకు వదిలేస్తోంది అన్నదే చర్చగా ఉంది. దేశంలో ఓట్ల చోరీ అంటూ కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ ఉద్యమిస్తున్నారు. మరి ఏపీలో కూడా ఈ ఉద్యమాన్ని ఎత్తుకుని అక్కడ విపక్ష భూమికను బలంగా ముందుకు తీసుకుని వెళ్ళే చాన్స్ ని ఎందుకు వదిలేస్తున్నారు అన్న చర్చ సాగుతోంది. ఇక స్థానిక సంస్థలకు ఎన్నికలు ప్రస్తుతం ఏపీలో జరుగుతున్నాయి. అన్ని పార్టీలు తమ శక్తి మేరకు బరిలో నిలబడి తలపడుతున్నాయి. ఇండిపెండెంట్లు కూడా అనేక చోట్ల జాతకాన్ని పరీక్షించుకుంటున్నాయి. అలాంటిది కాంగ్రెస్ అయితే ఎందుకో ఇంతటి సువర్ణ అవకాశాన్ని వదిలేసుకుంటోందా అన్న చర్చ సాగుతోంది. కాంగ్రెస్ కి గత మూడు ఎన్నికలూ దెబ్బేశాయి. డిపాజిట్లు గల్లంతు అయ్యాయి. కానీ కాలం ఎపుడూ ఒకేలా ఉండదు అంటారు. అలాంటిది ఏపీలో అధికార కూటమి విపక్ష వైసీపీలకే రాజకీయ మైదానం వదిలేసి కాంగ్రెస్ ఇంకా వేచి చూసే ధోరణిలో ఉందా అన్నదే అంతా ఆలోచిస్తున్నారు. వామపక్షాలను ఇతర పాటీలని కలుపుకుని ఫ్రంట్ గా కట్టి ముందుకు సాగితే స్థానిక ఎన్నికల్లో ఎన్నో కొన్ని సీట్లు అయినా దక్కుతాయని కదా అని అంటున్నారు. ఒక వేళ అలా కాకపోయినా కాంగ్రెస్ తన రాజకీయ ఉనికిని చాటుకునే విధంగా ఉండేది కదా అని కూడా అంటున్నారు. అయితే ఏపీ మీద మాత్రం కాంగ్రెస్ కి సరైన ప్లాన్స్ ఉన్నాయా లేవా అన్నదే ఇపుడు అంతా చర్చించుకుంటున్నారు. ఏపీలో ఎన్డీయే బలంగా ఉంది. విపక్షంలో వైసీపీ ఉంది. జగన్ ని కలుపుకుంటే: దాంతో కాంగ్రెస్ ఇక్కడ తన రాజకీయ విస్తరణకు కొత్త ఆలోచనలు చేయాల్సి ఉంది. దక్షిణాదిన అంతటా తన హవా ఉన్న కాంగ్రెస్ కి ఏపీలో ఆ పలుకుబడిని ఉపయోగించి ఎంతో కొంత ఎదగడం కష్టం కాదని అంటున్నారు. కానీ ఆ దిశగా ప్రయత్నాలు జరగకపోవడమే ఆశ్చర్యంగా ఉందని అంటున్నారు. ఏపీలో జగన్ ని కలుపుకుంటే ఇండియా కూటమికి దక్షిణాదిన మరింత బలం వస్తుందని అంటున్నారు. అయితే జగన్ వద్దు అన్నదే కాంగ్రెస్ ఆలోచనగా ఉందా అని కూడా ప్రశ్నలు వస్తున్నాయి. దాంతో ఏపీలో కాంగ్రెస్ ని బలోపేతం చేయడం కోసం రాహుల్ ప్లాన్ ఏంటి అన్నది అర్థం కావడం లేదని అంటున్నారు.

బలుపా... వాపా

రాజమండ్రి, నవంబర్ 4,స్థానిక సంస్థల ఎన్నికలు ఫలితాలు చూసి మురిసిపోవడం వృధా. గతంలో జగన్ ఇలాగే సంబరపడి సాధారణ ఎన్నికల్లో చతికలపడ్డారు. అందుకే స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలకు, సాధారణ ఎన్నికల ఫలితాలకు పొంతన ఉండదు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడూ అధికార పార్టీ వైపు అనుకూలంగా ఉంటాయి. ఇంకా మూడేళ్ల కాలపరిమితి ఉండటంతో సహజంగానే ప్రజలు తమ ప్రాంత అభివృద్ధి అధికార పార్టీతోనే సాధ్యమవుతుందని నమ్ముతారు. నిధుల విడుదల, సమస్యల పరిష్కారం అధికార పార్టీతోనే వీలవుతుందని నమ్మి వారికే ఓటు వేస్తారు. రాష్ట్రంలో ఎవరు అధికారంలో ఉన్నా అదే పరిస్థితి. వైసీపీ హయాంలో జరిగిన స్థానిక ఎన్నికల్లో తాడిపత్రి మున్సిపాలిటీ ఒక్కటి మాత్రమే టీడీపీ గెలిచింది. మూడేళ్లలో పరిస్థితి మారి 2024 ఎన్నికల్లో కూటమి విజయ దుందుభి మోగించిన విషయాన్ని మర్చిపోకూడదు.. స్థానికసంస్థల ఎన్నికలకు, సాధారణ ఎన్నికలకు సంబంధమే ఉండదు. ప్రజలు తమ ఓటును స్వేచ్ఛగా, తమకు అనుకూలమని అనిపించేవారికే ఓటు వేస్తారు. ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ఘన విజయం సాధించడంపై రాజకీయ వర్గాల్లో మరియు ప్రజల్లో భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల ఫలితాల సరళిని బట్టి విశ్లేషకులు పలు రకాల విశ్లేషణలు చేపడుతున్నారు. రాష్ట్రంలో ఇచ్చాపురం నుండి కుప్పం వరకు మున్సిపాలిటీలలో లభించిన ఈ విజయం ప్రజలు కూటమి సుపరిపాలనపై ఉంచిన నమ్మకానికి నిదర్శనమని చంకలు గుద్దుకోవచ్చు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో స్థానిక నంస్థల్లో నిధులు నక్రమంగా వినియోగించబడి, గ్రామాలు మరియు పట్టణాలు మరింత వేగంగా అభివృద్ధి చెందుతాయని కూటమి నేతలు అభిప్రాయపడుతున్నారు. కానీ సాధారణ ఎన్నికల్లో ప్రజల మైండ్ సెట్ మారే అవకాశాలు లేకపోలేదు. ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ ఈ ఫలితాలపై భిన్నమైన ఆరోపణలు చేస్తోంది. కూటమి ప్రభుత్వం అధికార బలాన్ని, అధికారులను ఉపయోగించి ఏకపక్షంగా వ్యవహరించిందని, ప్రతిపక్ష అభ్యర్థుల నామినేషన్లను అక్రమంగా తిరస్కరింపజేసి ఈ విజయాన్ని సాధించిందని వారు విమర్శిస్తున్నారు. ఈ గెలుపు కేవలం సాంకేతికపరమైన మరియు రాజకీయ వ్యూహాత్మక ఒత్తిళ్ల వల్లే సాధ్యమైందని, దీనిని నిజమైన ప్రజా విజయంగా భావించలేమని ప్రతిపక్ష శ్రేణులు వాదిస్తున్నాయి.ఒక ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల విజయాలు అనేవి ప్రజల ఆకాంక్షలు మరియు ఆయా సమయాల్లోని

ఏపీ ఎన్నికలపై భిన్నాభిప్రాయాలు

రాజకీయ సమీకరణాలపై ఆధారపడి ఉంటాయి. విజేతలు దీనిని బాధ్యతగా భావించి స్థానిక సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాల్సి ఉండగా, విమర్శలను కూడా పరిగణనలోకి తీసుకుని పారదర్శకంగా ముందుకు సాగడం అవసరం. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు అనేది ప్రభుత్వ పాలనకు, వారిపై ప్రజలకు ఉన్న నమ్మకానికి నిదర్శనమని వీరు భావిస్తారు. ఈ విజయాలు పార్టీ కేడర్‌లో ఉత్సాహాన్ని నింపుతాయని, క్షేత్రస్థాయిలో పార్టీ పట్టును మరింత బలోపేతం చేస్తాయని నమ్ముతూ వారు సంబరాలు చేసుకుంటారు. స్థానిక ఎన్నికల్లో సాధారణంగా అధికారంలో ఉన్న పార్టీలకే అనుకూల వాతావరణం ఉంటుంది. అధికార బలం, పోలీసు వ్యవస్థ లేదా ఇతర వనరుల వినియోగం వల్లనే ఈ గెలుపు సాధ్యమైందనే ఆరోపణలు ఉంటాయి.స్థానిక సమస్యల ఆధారంగా జరిగే ఈ ఎన్నికల ఫలితాలు ఎప్పుడూ రాష్ట్ర లేదా జాతీయ స్థాయి రాజకీయ ముఖచిత్రాన్ని పూర్తిగా ప్రతిబింబించలేవు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు ఒక స్పష్టత నిచ్చాయి. ఇన్నాళ్లూ ఉన్న అనుమానాలు పటాపంచలయ్యాయి. చంద్రబాబు, పవన్ కల్యాణ్, మాధవ్ ల మధ్య పై స్థాయిలో సఖ్యత ఉన్నా కింది స్థాయి క్యాడర్ లో ఆ సమన్వయం ఉంటుందా? లేదా? అన్న అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఎందుకంటే కూటమి పొత్తులో భాగంగా సీట్ల సర్దుబాటుతో పాటు ఆశావహులు ఎక్కువగా ఉండటం, టిక్కెట్ దక్కని వాళ్లు నిరాశకు గురి కావడంతో నిన్నటి వరకూ కొంత శషభిషలు ఉండేవి. అయితే ఫలితాలను చూస్తుంటే మాత్రం కూటమి పార్టీల మధ్య సమన్వయం ఉన్నట్లు స్పష్టంగా కనిపించింది. అదే సమయంలో ఓట్ల బదిలీ కూడా ఖచ్చితంగానే జరిగిందని చెప్పాలి.ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార కూటమిలోని టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల మధ్య సీట్ల పంపకాలు, సమన్వయం మరియు ఓట్ల బదిలీ కీలక పాత్ర పోషించాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పట్టణ స్థానిక సంస్థల్లో కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటును అధికారికంగా ఖరారు చేశారు. అనేక దఫాలుగా సమావేశమై మేయర్, ఛైర్మన్ పదవుల పంపకం జరిగింది. తెలుగుదేశం పార్టీ ఎక్కువ స్థానాల్లో బరిలోకి దిగగా, జనసేన పార్టీ బీజేపీ లు మిగిలిన స్థానాల్లో బరిలోకి దిగాయి. కొన్ని చోట్ల ఏకగ్రీవమయ్యాయి. మరికొన్ని చోట్ల నామినేషన్ల సందర్భంగా స్క్రూటినీలో ప్రత్యర్థులకు చెందిన నామినేషన్ పత్రాలు తిరస్కరణకు గురి కావడంతో అక్కడ ఎన్నిక నామమాత్రమయింది. మరికొన్ని స్థానాల్లో వైసీపీ అభ్యర్థులు మధ్యలోనే బరిలో నుంచి పక్కకు తప్పుకున్నారు.మూడు పార్టీల మధ్య ఓట్ల చీలికను అరికట్టడానికి ముందస్తుగా సీట్ల పంపకాలు పూర్తి చేసుకుని వ్యూహాత్మకంగా అభ్యర్థుల ను నిలబెట్టాయి. కొన్ని ప్రాంతాల్లో మాత్రం స్థానిక నాయకుల మధ్య ఆశావహుల పోటీ వల్ల సమన్వయ లోపాలు తలెత్తినప్పటికీ, పెద్ద ఎత్తున ఓట్ల బదిలీ కూటమికి కలిసొచ్చింది. దీంతో పట్టణ స్థానిక సంస్థల ఓట్ల లెక్కింపులో కూటమి పార్టీలు ఇచ్చాపురం నుంచి కుప్పం వరకు స్పష్టమైన ఆధిక్యతను ప్రదర్శిస్తూ విజయపథంలో దూసుకెళ్లాయి. ఎక్కడా అభ్యర్థిని చూడకుండా పార్టీని చూసి ఓటు వేసినట్లు కనిపించింది. అందుకే ఎక్కువ శాతం కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించారు. పార్టీ అధినేతలు కూడా రెబెల్స్ ను పోటీ నుంచి తప్పుకోవాలని, లేకుంటే పార్టీ నుంచి నస్పెండ్ చేస్తామని ప్రకటించడం కూడా కొంత కూటమికి కలసి వచ్చిందనే చెప్పాలి. మరో మూడేళ్లు రాష్ట్రంలో కూటమి అధికారంలో ఉంటుంది కాబట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమిని గెలుపెంచుకుని తమ ప్రాంత అభివృద్ధి కి చేయూత నివ్వాలని ప్రజలు భావించినట్లుంది.

మరోసారి కోలుకోలేని వైఎస్సార్‌సీపీ దెబ్బ

విజయవాడ, నవంబర్ 4, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల ఫలితాల సరళి వైఎస్సార్‌సీపీకి మరోసారి కోలుకోలేని దెబ్బకొడుతోది. రాష్ట్రవ్యాప్తంగా దాదావు అన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో తెలుగుదేశం-జనసేన-బీజేపీ కూటమి హవా స్పష్టంగా కనిపిస్తుంటే, వైఎస్సార్‌సీపీ మాత్రం ఎక్కడో ఒకట్రెండు వార్డులు లేదా స్వల్ప ఓట్ల ఆధిక్యం దక్కినా దాన్నే ఏదో మెగా విజయంలా ప్రచారం చేసుకుంటోంది.అసలు తమకు ప్రజలు ఓట్లేయరని, కూటమి వేవ్‌లో తాము కొట్టుకుపోవడం ఖాయమని ఆ పార్టీ నాయకత్వానికి ముందే గట్టి నమ్మకం కుదిరినట్లుంది. అందుకే, ఆశించిన స్థాయి కంటే ఘోర పరాజయం ఎదురవుతున్నా, ఎక్కడో ఒకచోట లభించిన చిన్నిపాటి లీడ్‌ను పట్టుకుని ఓదార్పు వెతుక్కునే పనిలో పడ్డారు.సాక్షి మీడియా నెట్‌వర్క్‌తో పాటు సదరు పార్టీ సోషల్ మీడియా సైన్యం ప్రదర్శిస్తున్న వైఖరి ప్రజాస్వామ్యానికి నవ్వులాటగా మారింది. కూటమి అభ్యర్థులు వందలాది వార్డులలో, పోస్టల్ బ్యాలెట్లలో భారీ మెజారిటీతో దూసుకుపోతుంటే.. వాటిని కప్పిపుచ్చి, వైఎస్సార్‌సీపీకి అత్యంత అరుదుగా ఆధిక్యం వచ్చిన వార్డుల గణాంకాలను మాత్రమే హైలైట్ చేస్తూ స్క్రీన్లు నింపేస్తున్నారు. ఎక్కడో ఒక రౌండ్‌లో తాత్కాలికంగా ముందంజలోకి రాగానే, ఆ ప్యాచ్‌లను కట్ చేసి సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ ఏదో జగజ్జేతల్లా సంబరాలు చేసుకోవడం వారి ఆత్మవంచనకు, అంధకార ప్రతిపక్ష రాజకీయాలకు అద్దం పడుతోందిఅత్యంత విచిత్రమైన అంశమేమిటంటే.. అసలు పోలింగ్ రోజే మున్సిపల్ ఎన్నికలు అక్రమంగా జరిగాయని, తమ ఏజెంట్లను తరిమేశారని, ప్రజాస్వామ్యం ఖూనీ అయిపోయిందని విపరీతంగా రచ్చ చేశారు. ఆఖరికి పులివెందుల మున్సిపాలిటీలో వైఎస్ జగన్ రెడ్డి తన సొంత ఓటును కూడా వేయకుండా బహిష్కరించి, రీపోలింగ్ కావాలంటూ ధర్నాలు చేశారు. కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమై, అదే ఎన్నికల్లో పొరపాటున ఎక్కడైనా ఒకటి రెండు వార్డుల్లో వైఎస్సార్‌సీపీకి లీడ్ లేదా విజయం దక్కగానే క్షణాల్లో మాట మార్చేస్తున్నారు. అక్రమాలు జరిగాయన్న నోళ్లతోనే ఇప్పుడు ఆ ఓట్లను ప్రజాదరణ గా ప్రచారం చేసుకుంటూ ద్వంద్వ నీతిని చాటుకుంటున్నారు.దాదాపు అన్ని పట్టణ ప్రాంతాల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నుంచే కూటమి స్పష్టమైన ఆధిక్యాన్ని కనబరుస్తూ విజయకేతనం ఎగురవేస్తోంది. వాస్తవాన్ని ఒప్పుకునే ధైర్యం లేక, ప్రజా తీర్పును గౌరవించే మానసిక పరిపక్వత లేక వైఎస్సార్‌సీపీ ఇలాంటి మైండ్ గేమ్స్‌కు తెరలేపుతోంది.

రెఫరండంగా మారుతోన్న ఎన్నికలు

గుంటూరు, నవంబర్ 4, తాజాగా జరిగిన స్థానిక సంస్థల పోలింగ్ ఒకరకంగా ఫస్ట్ ఎపిసోడ్‌గానే చూడాలి. ఎందుకంటే.. అన్ని పార్టీలకూ కీలకమైన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ముందున్నాయి. అయితే.. ఈ ఎన్నికల్లో వాస్తవ పోలింగ్ శాతం గతంతో పోల్చుకుంటే బాగా తగ్గుముఖంపట్టింది. 2021లో జరిగిన స్థానిక ఎన్నికల్లో 69 శాతం మేరకు పోలింగ్ నమోదైంది. దీనితో పోల్చుకుంటే.. ఇప్పుడు సగటున 55 శాతం పోలింగ్ మాత్రమే నమోదైంది. ఈ పరిణామాలు.. అన్ని పార్టీలకూ అనేక విషయాలను నేర్పుతున్నాయని అంటున్నారు విశ్లేషకులు. ఏ పార్టీలో అయినా.. నాయకుల మధ్యకలివిడి ముఖ్యం. కూటమి పార్టీల్లో అధిష్టానాలు పదే పదే చెప్పినా.. ఈ తరహా కలివిడి లేని చోట చాలా వరకు ఓటింగ్ తగ్గిపోయింది. విశాఖ, విజయవాడ వంటి కీలక నగర పాలక సంస్థల పరిధిలో 50 శాతం ఓటు బ్యాంకు కూడా మించలేదు. దీనికి కారణం.. చివరి నిమిషం వరకు కూడా పార్టీలో ఐక్యత సాధించే ప్రయత్నం చేసినా.. దానిని అందుకోలేక పోవడమేనని అంటున్నారు. తద్వారా పోలింగ్‌పై ప్రజలు నిరాసక్తత చూపించారు. ఈ ఎన్నికలను రిఫరెండం అని కూటమి పార్టలు ప్రకటించకపోయినా.. సహజంగానే రెండున్న రేళ్ల ప్రభుత్వ పాలన తర్వాత.. వచ్చిన ఎన్నికలు కావడంతో అందరూ రిఫరెండంగానే భావిస్తారు. ఈ పరంగా చూసుకుంటే.. ఓటింగ్ శాతం తగ్గడంపై ప్రభుత్వం పునరాలోచన చేసుకోవాలని విశ్లేషకులు చెబుతున్నారు. కీలకమైన పథకాల విషయంలో జరుగుతున్న జాప్యం పెద్దగా ప్రభావం చూపిస్తోందన్నదివారి మాట. నిజానికి ఆర్టీసీ ఉచిత ప్రయాణం తీసుకువచ్చిన ఓట్లు కొంత మేరకు ప్రభుత్వానికి ప్లస్ అయ్యాయన్న వాదన కూడా ఉంది.

దుమ్మురేపిన రెబల్స్...

విజయవాడ, నవంబర్ 5, (న్యూస్ పల్స్)ఏపీ మున్సిపల్ ఎన్నికల్లో పలు చోట్ల రెబల్ అభ్యర్థులు ట్విస్ట్ ఇచ్చారు. టికెట్ దక్కలేదని వెనక్కి తగ్గకుండా.. స్వతంత్రులుగా బరిలోకి దిగి ప్రధాన పార్టీల అభ్యర్థులకు షాక్ ఇచ్చారు. ఆదోనిలో జనసేన రెబల్ ఏకంగా చైర్‌పర్సన్ స్థానాన్నే దక్కించుకోవడం హాట్ టాపిక్‌గా మారింది. ఏపీ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో రెబల్ అభ్యర్థులు ఊహించని విధంగా సత్తా చాటారు. పార్టీల టికెట్లు దక్కకపోయినా.. స్వతంత్రులుగా బరిలోకి దిగి ఓటర్ల మద్దతుతో విజయం సాధించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం మున్సిపాలిటీలో జనసేన ఛైర్మన్ పీఠాన్ని దక్కించుకుంది. మొత్తం 36 వార్డులున్న పిఠాపురంలో ఏకంగా పది వార్డుల్లో స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధించారు. దీంతో రెబల్స్ గెలుపు స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా ఆదోని మున్సిపల్ ఎన్నికల్లో జనసేన రెబల్ అభ్యర్థి గెలిచి ఈ ఎన్నికల్లో చరిత్ర సృష్టించారు.ఇక కర్నూలు జిల్లా ఆదోని మున్సిపల్ ఎన్నికల్లో మరో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. జనసేన రెబల్ అభ్యర్థిగా బరిలోకి దిగిన స్వప్న మల్లప్ప నాయకర్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి చైర్‌పర్సన్ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. కూటమి సీట్ల సర్దుబాటులో భాగంగా ఆదోని చైర్‌పర్సన్ స్థానం టీడీపీకి కేటాయించారు. నాగమణిని టీడీపీ అభ్యర్థిగా ఖరారు చేశారు. దీంతో జనసేన ఆదోని ఇన్‌చార్జి మల్లప్ప నాయకర్ తన భార్య స్వప్నను స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దించారు. చివరకు ఆమె విజయం సాధించడంతో ఆదోని రాజకీయాల్లో ఈ ఎన్నిక ప్రత్యేకంగా నిలిచింది. స్వప్న భర్త మల్లప్ప నాయకర్ మాట్లాడుతూ.. స్వప్న గెలుపును పవన్ కళ్యాణ్‌కు బహుమతిగా ఇస్తున్నామని పేర్కొన్నారు. తాను ఎప్పటికీ పవన్ అభిమానిని అని.. ఆయనతోనే ఉంటానని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ తనకు అండగా ఉన్నారన్నారు..పిఠాపురం నియోజకవర్గంలోని గొల్లప్రోలులోనూ స్వతంత్ర అభ్యర్థులు పార్టీలకు షాక్ ఇచ్చారు. నాలుగు వార్డుల్లో రెబల్ అభ్యర్థులు విజయం సాధించారు. ఇద్దరు జనసేన రెబల్స్, ఇద్దరు టీడీపీ రెబల్ అభ్యర్థులు బరిలో నిలిచి గెలిచారు. ఇక ఏలూరు మున్సిపల్ ఎన్నికల్లోనూ స్వతంత్ర అభ్యర్థులు ప్రభావం చూపించారు. దాదాపు ఎనిమిది మంది ఇండిపెండెంట్లు విజయం సాధించారు.మొత్తంగా ఏపీ మున్సిపల్ ఎన్నికల్లో రెబల్ అభ్యర్థుల గెలుపు ప్రధాన పార్టీలకు కొత్త రాజకీయ సమీకరణాలను తెరపైకి తెచ్చింది.

స్పోర్ట్స్ న్యూస్

హాఫ్ సెంచరీతో రాణించిన కోహ్లీ.. కివీస్‌పై భారత్ ఘన విజయం



ఆక్లాండ్ వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో నాలుగు వికెట్ల తేడాతో(డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో) భారత్ ఘన విజయం సాధించింది. . టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్.. 40.2 ఓవర్లలో 185 పరుగులకు ఆలౌటైంది. అనంతరం వర్షం అంతరాయం కలిగించడంతో టార్గెట్ 32 ఓవర్లలో 143 పరుగులకు కుదించారు. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ(74) అర్ధ సెంచరీతో రాణించడంతో భారత్ 22.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. దీంతో ఐదు వన్డేల సిరీస్‌లో టీమిండియా 1-0 ఆధిక్యంలో నిలిచింది.మ్యాచ్ విషయానికి వస్తే.. టాస్ గెలిచిన భారత్ బౌలింగ్ ఎంచుకుంది. దీంతో న్యూజిలాండ్ తొలుత బ్యాటింగ్ దిగింది. ఈ క్రమంలో భారత బౌలర్ల ధాటికి కివీస్ 40.2 ఓవర్లలో 185 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ టిమ్ సీఫర్ట్(38) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. గ్లెన్ ఫిలిప్స్(30), టిక్నర్(34), డారిల్ మిచెల్(28), డఫీ(18×) మినహా మిగతా బ్యాటర్లంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. విల్ యంగ్(9), నికోల్స్(9), టామ్ లాథమ్(3), శాంట్నర్(4), స్మిత్(1), జెమీసన్(1) విఫలమయ్యారు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ 4, గుర్నూర్ బ్రార్ 3, అన్షుల్ కాంబోజ్ 2 వికెట్లతో చెలరేగారు.అనంతరం స్వల్ప లక్ష్యంగాతో బ్యాటింగ్ దిగిన భారత్‌కు ఆరంభంలోనే బిగ్ షాక్ తగిలింది. ఓపెనర్ రోహిత్ శర్మ పరుగులు ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరాడు. ఆ తర్వాత వన్ డౌన్‌లో వచ్చిన విరాట్ కోహ్లీ(74), కెప్టెన్ శుబ్‌మన్ గిల్(37)తో కలిసి స్కోర్ బోర్డును కదిలించాడు. వీరిద్దరూ కలిసి 113 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. 114 పరుగుల వద్ద నాథన్ స్మిత్ బౌలింగ్‌లో గిల్ పెవిలియన్ చేరాడు. ఈ క్రమంలోనే పలుమార్లు వర్షం అంతరాయం కలిగించడంతో డక్‌వర్త్ లూయిల్ పద్ధతిలో టార్గెట్‌ను 32 ఓవర్లలో 143 పరుగులకు కుదించారు. ఈ క్రమంలో ఐదు వికెట్లు కోల్పోయిన భారత్ 22.2 ఓవర్లలో 143 పరుగులు చేసింది. కివీస్ బౌలర్లలో డఫీ మూడు వికెట్లు సాధించాడు. జెమీసన్, నాథన్ స్మిత్ చెరో వికెట్ తీశారు.

ఆ ఇద్దరు నా ఫేవరెట్ కెప్టెన్లు.. సచిన్ టెండూల్కర్ ఆసక్తికర వ్యాఖ్యలు



భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్.. తాజాగా తనకు ఇష్టమైన కెప్టెన్లు ఎవరో వెల్లడించాడు. భారత జట్టుకు తాను కూడా కొంతకాలం సారథ్యం వహించినప్పటికీ.. తన కెరీర్‌లో ఎంతోమంది దిగ్గజ కెప్టెన్ల నాయకత్వంలో ఆడాడు. ముఖ్యంగా సౌరభ్ గంగూలీ, మహేంద్ర సింగ్ ధోనీ కెప్టెన్సీలో ఎన్నో చిరస్మరణీయ విజయాల్లో భాగమయ్యాడు. తాజాగా ఓ కార్యక్రమంలో అభిమాని అడిగిన ప్రశ్నకు సమాధానంగా తన ఫేవరెట్ కెప్టెన్ల పేర్లను వెల్లడించాడు'భారత టెస్టు జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన అనుభవం ఎలా ఉంది? ఆ బాధ్యతలకు అలవాటు పడటం ఎంత కష్టమైంది? మీ ఫేవరెట్ కెప్టెన్ ఎవరు?' అంటూ సచిన్‌ను ఓ అభిమాని ప్రశ్నించాడు. 'భారత జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించడం గొప్ప గౌరవంగా భావించాను. అయితే జట్టును పూర్తిగా నా ఇష్టానుసారం ఎంపిక చేసుకునే స్వేచ్ఛ ఎప్పుడూ ఉండేది కాదు. నాటితో పోలిస్తే ప్రస్తుతం బీసీసీఐ చాలా అభివృద్ధి చెందింది. వృత్తి పరమైన సంస్థగా ఎదిగింది. భారత క్రికెట్ ఆ సమయంలో చాలా క్లిష్టమైన దశను ఎదుర్కొంది. నేను కూడా కెప్టెన్‌గా జట్టుకు కొంతకాలం సేవలు అందించాను. కానీ నా ఫేవరేట్ కెప్టెన్లు మాత్రం సౌరభ్ గంగూలీ, మహేంద్ర సింగ్ ధోనీ' అని సచిన్ వెల్లడించాడు.ఇక టెస్టుల్లో అదరగొడుతున్న దక్షిణాఫ్రికా కెప్టెన్ టెంబా బవుమాపై కూడా సచిన్ ప్రశంసలు కురిపించాడు. 'బవుమా పోరాట స్ఫూర్తిని నేను నిజంగా అభినందిస్తాను. ముందుండి జట్టును నడిపిస్తూ దక్షిణాఫ్రికా క్రికెట్‌కు అద్భుతమైన ఫలితాలు అందించాడు. దక్షిణాఫ్రికా ఐసీసీ టైటిల్ గెలవడం ప్రపంచ క్రికెట్‌కు కూడా ఎంతో మంచిది' అని సచిన్ ప్రశంసించాడు.

తెరపైకి మరో ట్రేడ్ డీల్.. రూ.13 కోట్ల స్టార్ క్రికెటర్‌పై సీఎస్కే కన్ను!



ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందే ఫ్రాంచైజీల మధ్య ట్రేడింగ్ వ్యవహారం ఆసక్తికరంగా మారుతోంది. ఇప్పటికే ముంబై ఇండియన్స్ స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య ట్రేడ్‌పై భారీ చర్చ జరుగుతుండగా.. తాజాగా మరో కీలక ఆటగాడి పేరు తెరపైకి వచ్చింది. ఇంగ్లండ్ విధ్వంసకర ఆల్‌రౌండర్ లియామ్ లివింగ్‌స్టోన్‌ను తమ జట్టులోకి తీసుకునేందుకు చెన్నై సూపర్ కింగ్స్ (ఆూఐ) ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఞఖీఊ) నుంచి అతడిని ట్రేడ్ చేసుకునే అవకాశాలను సీఎస్కే పరిశీలిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి.ఐపీఎల్ 2026 వేలానికి ముందు లియామ్ లివింగ్‌స్టోన్‌ను సన్‌రైజర్స్ హైదరాబాద్ ఏకంగా రూ.13 కోట్లకు కొనుగోలు చేసింది. అయితే ఆ సీజన్‌లో అతడి ప్రదర్శన ఏమాత్రం ఆశించిన స్థాయిలో లేదు. కేవలం రెండు మ్యాచ్‌లు ఆడిన లివింగ్‌స్టోన్ 15 పరుగులు మాత్రమే చేశాడు. పేలవ ఫామ్ కారణంగా మిగిలిన సీజన్‌లో తుది జట్టులోనే కాకుండా ఇంపాక్ట్ ప్లేయర్‌గా కూడా అవకాశం దక్కించుకోలేకపోయాడు. ఈ నేపథ్యంలో అతడిని వదులుకునేందుకు ఎస్ఆర్‌హెచ్ సిద్ధమైనట్లు సమాచారం. దీంతో తమ జట్టులో ఓ విదేశీ ఆటగాడి కోసం సీఎస్కే పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

బుమ్రాపై అలాంటి విమర్శలు చేయడం సరికాదు: షేన్ బాండ్



భారత్, న్యూజిలాండ్ మధ్య జరిగే ఐదు వన్డేల సిరీస్‌కు భారత స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రాకు విశ్రాంతి కల్పించారు. నవంబర్ 19 నుంచి ప్రారంభమయ్యే రెండు టెస్టుల సిరీస్‌కు అతడు తిరిగి జట్టులోకి వచ్చే అవకాశం ఉంది. ఇటీవలే గాయం నుంచి కోలుకున్న బుమ్రా విషయంలో టీమ్ మేనేజ్‌మెంట్ ఆచితూచి వ్యవహరిస్తోంది. ఈ క్రమంలో బుమ్రా వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌పై జరుగుతున్న చర్చకు న్యూజిలాండ్ దిగ్గజం షేన్ బాండ్ తెరదించాడు. బుమ్రా కావాలని కొన్ని సిరీస్‌లకు దూరంగా ఉంటున్నాడంటూ వస్తున్న వార్తలపై స్పందించాడు. బుమ్రాకు మద్దతుగా నిలుస్తూ.. అలాంటి విమర్శలు చేయడం సరికాదని అభిప్రాయపడ్డాడు. గాయాల నుంచి కోలుకుని తిరిగి అంతర్జాతీయ క్రికెట్‌లోకి రావడం ఫాస్ట్ బౌలర్లకు అంత సులభమైన విషయం కాదని గుర్తుచేశాడు.'సీనియర్ బౌలర్లకు తమ శరీర సామర్థ్యం గురించి బాగా తెలుస్తుంది. వారు తమ పనిభారంపై వైద్య సిబ్బంది, కోచ్‌లతో నిరంతరం చర్చిస్తుంటారు. ఎంతవరకు ఆడగలరో అంచనా వేసుకుంటారు. ముఖ్యంగా గాయం నుంచి కోలుకుని తిరిగి పోటీ క్రికెట్‌లోకి అడుగుపెట్టే సమయంలో ఆచితూచి వ్యవహరిస్తారు. బుమ్రా కావాలనే మ్యాచ్‌లకు దూరంగా ఉంటున్నాడని విమర్శించడం చాలా అన్యాయం. ఇది ఒక్క బుమ్రాకే కాదు.. ప్రతి ఆటగాడికీ వర్తిస్తుంది. భారత్ ఏడాది పొడవునా భారీ షెడ్యూల్‌తో బిజీగా ఉంటుంది. అందుకే ఆటగాళ్ల పనిభారాన్ని జాగ్రత్తగా నిర్వహించడం చాలా అవసరం. వచ్చే ఏడాది అక్టోబర్ లేదా నవంబర్‌లో జరిగే ప్రపంచకప్ సమయానికి మన అత్యుత్తమ ఆటగాళ్లు పూర్తి ఫిట్‌నెస్‌తో ఉత్సాహంగా ఉండాలి' అని షేన్ బాండ్ అభిప్రాయపడ్డాడు.

న్యూజిలాండ్ బ్యాటర్‌ను రెచ్చగొట్టిన గుర్నూర్ బ్రార్!



భారత్, న్యూజిలాండ్ మధ్య జరుగుతున్న తొలి వన్డేలో ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. టీమిండియా యువ పేసర్ గుర్నూర్ బ్రార్, కివీస్ టెయిలెండర్ బ్లెయిర్ టిక్నర్ మధ్య ఆసక్తికర సంభాషణ చోటు చేసుకుంది. చివరి వికెట్‌గా క్రీజులోకి వచ్చిన టిక్నర్ అనూహ్యమైన బ్యాటింగ్‌తో భారత బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఈ క్రమంలో దూకుడుగా ఆడుతున్న టిక్నర్‌కు గుర్నూర్ బ్రార్ రెచ్చగొట్టేలా ప్రవర్తించాడు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.తన బౌలింగ్‌లో ఫుల్ షాట్ ఆడాలని, షార్ట్ బాల్ వేస్తానన్నట్లు టిక్నర్ కు గుర్నూర్ సైగల్ చేశాడు. ఈ స్లెడ్జింగ్‌కు టిక్నర్ తనదైన శైలిలో స్పందించాడు. వికెట్ల వెనుకకు వెళ్లి సైగలు చేశాడు. చెప్పినట్లుగానే గుర్నూర్ షార్ట్ బాల్ వేయగా.. టిక్నర్ భారీ షాట్ ఆడే ప్రయత్నం చేశాడు. కానీ దురదృష్టవశాత్తు బ్యాట్ ఎడ్జ్ తాకిన బంతి వికెట్ కీపర్‌వైపు దూసుకెళ్లగా.. కేఎల్ రాహుల్ జంప్ చేసి సులువుగా క్యాచ్ అందుకున్నాడు. ఆ వెంటనే గుర్నూర్ బ్రార్ గాల్లోకి ఎగురుతూ సంబరాలు చేసుకుంటూ టిక్నర్ వైపు పరుగెత్తాడు. అతడు కూడా అంతే సరదాగా నవ్వుతూ స్పందించాడు. బౌలర్, బ్యాటర్ మధ్య ఉన్న ఈ క్రీడాస్ఫూర్తి ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది.ఇక మ్యాచ్ విషయానికి వస్తే.. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 40.2 ఓవర్లలో 185 పరుగులకే ఆలౌటైంది. టెయిలెండర్ టీమ్ సీఫెర్ట్(38),బ్లెయిర్ టిక్నర్(34) టాప్ స్కోరర్లుగా నిలిచారు. టీమిండియా బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ నాలుగు వికెట్లు తీశాడు. గుర్నూర్ బ్రార్ 3, అన్షుల్ కాంబోజ్ 2 సాధించాడు.

వన్డేల్లో విరాట్ వరల్డ్ రికార్డు.. మూడో స్థానంలో 13వేల పరుగులు చేసిన తొలి ప్లేయర్‌గా..



భారత స్టార్ విరాట్ కోహ్లీ వన్డే క్రికెట్ చరిత్రలో ఎవరూ సాధించని అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. వన్డేల్లో మూడో స్థానంలో బ్యాటింగ్ చేస్తూ 13 వేల పరుగుల మైలురాయిని అందుకున్న తొలి ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. న్యూజిలాండ్‌తో ఆక్లాండ్‌లో జరుగుతున్న తొలి వన్డేలో విరాట్ ఈ రికార్డును అందుకున్నాడు. కోహ్లీకి ఈ మైలురాయిని చేరుకోవడానికి కేవలం 12 పరుగులు అవసరమయ్యాయి. ఇన్నింగ్స్ ఏడో ఓవర్‌లో తన 13వ బంతిని ఎదుర్కొన్న సమయంలోనే ఈ ఘనతను సాధించాడు.కోహ్లీ ఈ రికార్డును కేవలం 251 ఇన్నింగ్స్‌ల్లోనే అందుకోవడం విశేషం. మూడో స్థానంలో అతడి బ్యాటింగ్ సగటు 61.55గా ఉంది. ఈ స్థానంలో ఇప్పటివరకు 48 సెంచరీలు, దాదాపు 70 అర్ధసెంచరీలు సాధించాడు. వన్డే క్రికెట్‌లో టాప్ ఆర్డర్ బ్యాటర్‌గా అతడి ఆధిపత్యానికి ఈ గణాంకాలే నిదర్శనం. ఇప్పటివరకు వన్డేల్లో నంబర్ 3 స్థానంలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ రెండో స్థానంలో ఉన్నాడు. పాంటింగ్ తన కెరీర్‌లో 330 ఇన్నింగ్స్‌ల్లో 12,662 పరుగులు సాధించాడు. ఇప్పుడు కోహ్లీ 13 వేల పరుగుల మార్కును దాటి రికీ రికార్డును బ్రేక్ చేశాడు. వన్డే చరిత్రలో మూడో స్థానంలో 10 వేల పరుగుల మార్కును దాటిన ఆటగాళ్లు కోహ్లీ, పాంటింగ్ మాత్రమే కావడం గమనార్హం.

నంబర్ 3లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్లు వీరే..విరాట్ కోహ్లీ(భారత్) ? 13,000 పరుగులురికీ పాంటింగ్(ఆస్ట్రేలియా) ? 12,662 పరుగులుకుమార సంగక్కర(శ్రీలంక) ? 9,747 పరుగులుజాక్వెస్ కలిస్(సౌతాఫ్రికా) ? 7,774 పరుగులుకేన్ విలియమ్సన్(న్యూజిలాండ్) ? 6,504 పరుగులుబాబర్ ఆజం(పాకిస్తాన్) ? 6,054 పరుగులుజో రూట్(ఇంగ్లండ్) ? 5,525 పరుగులు

తొలి వన్డేలో న్యూజిలాండ్ ఆలౌట్.. భారత్ టార్గెట్ ఎంతంటే?

ఆక్లాండ్ వేదికగా భారత్-న్యూజిలాండ్ జట్ల మధ్య తొలి వన్డే జరుగుతోంది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్.. 40.2 ఓవర్లలో 185 పరుగులకు ఆలౌటైంది. భారత్‌కు 186 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని నిర్దేశించింది. భారత బౌలర్ల ధాటికి కివీస్ బ్యాటర్లు వరుసగా పెవిలియన్ బాట పట్టారు. ఓపెనర్ టిమ్ సీఫర్ట్(38) టాప్ స్కోరర్ గ్లన్ ఫిలిప్స్(30), టిక్నర్(34), డారిల్ మిచెల్(28), డఫీ(18×) మినహా మిగతా బ్యాటర్లంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. విల్ యంగ్(9), నికోల్స్(9), టామ్ లాథమ్(3), శాంట్నర్(4), స్మిత్(1), జెమీసన్(1) విఫలమయ్యారు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ 4, గుర్నూర్ బ్రార్ 3, అన్షుల్ కాంబోజ్ 2 వికెట్లతో చెలరేగారు.



సినిమా

ఈ దీపావళిని 'సీన్' మూవీతో సెలబ్రేట్ చేసుకుందాం - హీరో సూర్య



హీరో సూర్య, మలయాళ బ్లాక్‌బస్టర్ 'ఆవేశం' ఫేమ్ దర్శకుడు జిత్తు మాధవన్‌తో కలసి యాక్షన్-కామెడీ ఎంటర్‌టైనర్ 'సీన్' చేస్తున్నారు. నజ్రియా నజీమ్ హీరోయిన్‌గా నటిస్తుండగా, నస్లేన్, ఆనంద్ రాజ్, లాల్, రాజ్ ప్రియన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. జ్యోతిక, సూర్య అగరం స్టూడియోస్, 2డీ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జయశ్రీ దామోదరన్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషన్ కంటెంట్ కు అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. ఈ చిత్రం ఆంధ్రప్రదేశ్ & తెలంగాణలో ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ ఎన్వీఆర్ సినిమా ద్వారా గ్రాండ్ రిలీజ్ కానుంది. 'సీన్' చిత్రం ప్రపంచవ్యాప్తంగా 2026 నవంబర్ 6న దీపావళి కానుకగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ గ్రాండ్ గా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు.

ప్రీ రిలీజ్ ఈవెంట్ లో హీరో సూర్య మాట్లాడుతూ.. అందరికీ థాంక్యూ. లవ్ యు. మనందరం ఒక్కటే. వి ఆర్ వన్ ఫ్యామిలీ. మీరందరూ నాకు అన్‌కండిషనల్ లవ్ ఇచ్చారు. ఈ ఏడాదిలో మిమ్మల్ని కలవడం ఇది మూడోసారి. దీన్ని ఒక బ్లెస్సింగ్‌గా భావిస్తున్నాను. ఈ ఏడాది చాలా అద్భుతంగా ఉంది. ఇప్పుడు అందరూ పాన్ ఇండియా గురించి మాట్లాడుతున్నారు. కానీ నాగార్జున గారు ఇంతకుముందే ఇతర భాషల డైరెక్టర్స్‌తో కలిసి పనిచేశారు. అన్ని ఇండస్ట్రీలను కలుపుకుంటూ వర్క్ చేసేవారు. మణిరత్నం గారు, ప్రియదర్శన్ గారు, మహేష్ భట్ గారు.. ఇలా ఎంతోమంది దర్శకులతో కలిసి పనిచేశారు. అది ఎప్పుడూ నా మనసులో ఉంటుంది. 'విశ్వనాథన్ అండ్ సన్స్'లో చాలా భాషలకు చెందిన నటీనటులు కలిసి పనిచేశారు. ఎక్కడికి వెళ్లినా చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. వెంకీ చాలా బ్యూటిఫుల్ ఫిల్మ్ ఇచ్చాడు. ఇప్పుడు జిత్తుతో కలిసి 'సీన్' చేశాను. తన 'రోమాంచం', 'ఆవేశం' సినిమాలను మీరు చూసే ఉంటారు. 'సీన్' కూడా అలాంటి ఒక బ్యూటిఫుల్ సినిమా. తనతో కలిసి పనిచేయడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. 'వీరభద్రుడు', 'విశ్వనాథన్ అండ్ సన్స్' తర్వాత మరోసారి మిమ్మల్ని కలవడం హ్యాపీగా ఉంది. మీ అందరి ప్రేమకు థాంక్యూ. మా టీమ్ సభ్యులు అద్భుతమైన వర్క్ ఇచ్చారు. మేమందరం కలిసి ఒక బ్యూటిఫుల్ సినిమాను అందిస్తున్నాం. ఇందులో మర్డర్ మిస్టరీ, మ్యాడ్‌నెస్, నవ్వులు.. అన్నీ ఉన్నాయి. రాకేందు మౌళి తెలుగులో చాలా చక్కని మాటలు, పాటలు రాశారు. చాలా కమిట్‌మెంట్‌తో పనిచేశారు. ఈ సినిమాలో చాలా ఫ్రెష్ టాలెంట్ కూడా ఉంది. నజ్రియాతో కలిసి పనిచేయడం చాలా హ్యాపీగా అనిపించింది. తను చాలా అద్భుతమైన నటి. తను నేచురల్ స్టార్. ఈ సినిమాలో తను స్టంట్స్ కూడా చేసింది. ఇది చాలా స్పెషల్ ఫిల్మ్. ఇందులో ఒక డైలాగ్ ఉంది. అది నిజంగా మీ జీవితంలో కూడా ఉపయోగపడుతుంది. మనపై మనం నమ్మకం ఉంచి ప్రయత్నిస్తే ఏదైనా సాధించవచ్చు. 'సీన్' చాలా మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ కూడా. కుటుంబ సభ్యులందరూ కలిసి వచ్చి ఈ సినిమాను చూడొచ్చు. ఈ సినిమాతో దీపావళిని సెలబ్రేట్ చేసుకుందాం. లవ్ యు ఆల్.

హీరోయిన్ నజ్రియా నజీమ్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. 'అంటే సుందరానికి' సినిమా తర్వాత మరోసారి మీ అందరినీ కలుసుకోవడం చాలా ఆనందంగా ఉంది. మీ అందరి ప్రేమ, ఆదరణ, అభిమానానికి ధన్యవాదాలు. ఈ సినిమాలో యాక్షన్ సీక్వెన్స్‌లు చేశాను. ఈ సందర్భంగా మాస్టర్స్‌కు థాంక్స్ చెబుతున్నాను. వాళ్లు నాకు చాలా కాన్ఫిడెన్స్ ఇచ్చారు. నాకు మాయ లాంటి క్యారెక్టర్ ఇచ్చిన జిత్తు మాధవన్‌కు థాంక్యూ. క్యారెక్టర్ చాలా యూనిక్‌గా ఉంటుంది. అలాగే మా టీమ్ అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. సూర్య గారితో కలిసి పనిచేయడం చాలా ఆనందంగా ఉంది. నవంబర్ 6న అందరూ థియేటర్లలో ఈ సినిమాను చూడాలని కోరుకుంటున్నాను.

డైరెక్టర్ వెంకీ అట్లూరి మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. అందరూ సూర్య గారిని హ్యాట్రిక్ హిట్ కొట్టాలని అడుగుతున్నారు. నేను కూడా తోటి ఫ్యాన్‌గా అదే అడుగుతున్నాను. కచ్చితంగా హిట్ కొట్టాలి. అభిమానులుగా మీ అందరం ప్రామిస్ చేస్తున్నాం.. ఇది హ్యాట్రిక్ హిట్ అవుతుంది. ఆయన ఈ ఏడాది మూడో సినిమాతో వస్తున్నారు. మరో రెండు సినిమాలు ఆల్రెడీ షూటింగ్ పూర్తి చేసుకున్నాయి. ఇంకో సినిమా స్టార్ట్ కాబోతోంది. ఆయన ఎందుకంత హార్డ్ వర్క్ చేస్తున్నారంటే, ఆయనకు సినిమా అంటే ఇష్టం. సంవత్సరంలో 365 రోజులు ఆయన సినిమా కోసమే పనిచేస్తారు. మనం సూర్య గారికి సెల్యూట్ చెప్పాలి. ఈ టీమ్ అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. తప్పకుండా ఈ సినిమా అందరినీ అలరిస్తుంది.

లిరిక్ రైటర్ రాకేందు మౌళి మాట్లాడుతూ.. 'వీరభద్రుడు', 'విశ్వనాథన్ అండ్ సన్స్'తో సూర్య గారు రెండు బ్లాక్‌బస్టర్లు కొట్టారు. ఇప్పుడు ఈ సినిమాతో హ్యాట్రిక్ కొట్టబోతున్నారు. ఈ సినిమాలో సూర్య గారు చేస్తున్న క్యారెక్టర్.. 'సింగం', 'శివపుత్రుడు' క్యారెక్టర్లను మిళితం చేసినట్టుగా ఉంటుంది. ఎంటర్‌టైన్‌మెంట్, మాస్ రెండూ ఉంటాయి. ఈ సినిమాకు అన్ని పాటలు, డైలాగ్స్ రాశాను. ఇవి వింటున్నప్పుడు ఒక తెలుగు సినిమా చూస్తున్న ఫీలింగ్ మీకు కలుగుతుంది. నవంబర్ 6న ఈ సినిమా మీ ముందుకు వస్తుంది. ఇందులో చాలా కామెడీ ఉంటుంది. పొట్ట చెక్కలయ్యేలా నవ్వులు ఉంటాయి. ఒక క్రేజీ ఎక్స్‌పీరియన్స్‌ను అందిస్తుంది.

ప్రొడ్యూసర్ జయశ్రీ దామోదరన్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. అగరం స్టూడియోస్‌లో మేము చేస్తున్న తొలి సినిమా ఇది. సూర్య గారి వల్ల ఇది సాధ్యపడింది. ఈ దీపావళికి అందరూ ఎంజాయ్ చేసే సినిమా ఇది. మా డిస్ట్రిబ్యూటర్ ఎన్వీఆర్ ప్రసాద్ గారికి ధన్యవాదాలు. అందరూ ఈ సినిమాను థియేటర్లలో ఎంజాయ్ చేయాలని కోరుకుంటున్నాను.

నిర్మాత ఎన్వీ ప్రసాద్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. సూర్య గారి కెరీర్‌లో ఎన్నో బిగ్ హిట్స్ ఉన్నాయి. ఈ ఏడాది 'వీరభద్రుడు', 'విశ్వనాథన్ అండ్ సన్స్', ఇప్పుడు 'సీన్'.. ఈ మూడు సినిమాలు బ్లాక్‌బస్టర్ విజయాలతో ప్రేక్షకులను అలరిస్తాయని ఆశిస్తున్నాను. కచ్చితంగా ఈ సినిమా సూర్య గారికి హ్యాట్రిక్ అవుతుంది. అలాగే డైరెక్టర్ గారికి కూడా ఇది హ్యాట్రిక్ సినిమా అవుతుంది. నజ్రియా, నస్లేన్, రాజశేఖర్‌తో పాటు ఈ సినిమాకు పనిచేసిన ప్రతి ఒక్కరికీ అభినందనలు. ఈ దీపావళికి ఈ సినిమా అందరినీ ఎంతో ఎంటర్‌టైన్ చేస్తుంది. సూర్య గారి కెరీర్‌లో ఇది చాలా కొత్త సినిమా అవుతుంది. సూర్య గారు అగరం ఫౌండేషన్ ద్వారా చాలా అద్భుతమైన కార్యక్రమాలు చేస్తున్నారు. ఆయన సేవలను తమిళనాడుతో పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కూడా విస్తరిస్తే మేమందరం ఎంతో సంతోషిస్తాం

మయూఖ" సినిమా 25 డేస్ గ్రాండ్ సక్సెస్ సెలబ్రేషన్స్



పాయల్ చెంగప్ప ప్రధాన పాత్రలో నటించిన సినిమా "మయూఖ". ఈ చిత్రాన్ని ప్రశ్వీత ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్ పై శశిధర్ నల్ల నిర్మించారు. శ్రీ తేజ్ ఎస్.కె. దర్శకత్వం వహించారు. ఇటీవలే గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ ద్వారా ప్రేక్షకుల ముందుకొచ్చిన "మయూఖ" సినిమా ట్రెండ్ సెట్టింగ్ థ్రిల్లర్ గా బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని అందుకుంది. ఈ సినిమా 25 రోజుల సక్సెస్ సెలబ్రేషన్స్ ఈ రోజు హైదరాబాద్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పొలిటికల్ లీడర్ చిన్న శ్రీశైలం యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వలువురు మీడియా మిత్రులు ఈ కార్యక్రమంలో పాల్గొని "మయూఖ" సినిమా టీమ్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా

ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ డి.గిరీష్ రెడ్డి మాట్లాడుతూ - మా సినిమాకు ఉన్న బడ్జెట్ లో ఇంత క్వాలిటీగా సినిమా చేసి, గ్రాండ్ గా రిలీజ్ చేసుకున్నాం అంటే అందుకు మా డైరెక్టర్ విజన్ కారణం. ఆయనకు పెద్ద బడ్జెట్ ఇచ్చి సినిమా చేయమంటే మిరాకిల్స్ చేస్తారు. మా సినిమాను సక్సెస్ చేసిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్. అన్నారు.

యాక్టర్ రఘు వాసిరెడ్డి మాట్లాడుతూ - మా సినిమా సక్సెస్ షీల్డ్ అందుకోవడం నా కెరీర్ లో ఎంతో స్పెషల్ మూవ్ మెంట్ గా భావిస్తున్నా. ఈ షీల్డ్ నేను అందుకున్నానంటే కారణం మా డైరెక్టర్ శ్రీతేజ్. ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటాను. అన్నారు.

యాక్టర్ అభిలాష్ అడ్డ మాట్లాడుతూ - ఈ రోజున సినిమాలు ఒక వారం రోజులు ఆదరణ పొందితేనే గొప్ప విషయం. అలాంటిది మా సినిమాకు పాతిక రోజుల రన్ ఇచ్చిన ప్రేక్షకులకు థ్యాంక్స్ చెబుతున్నాం. చిన్న సినిమాల విషయంలో బాక్సాఫీస్ వద్ద ఇది అరుదుగా దక్కే విజయం. ఈ సినిమా సక్సెస్ మా డైరెక్టర్ విజన్, కన్విక్షన్ ను చూపిస్తోంది. అన్నారు.

ప్రొడ్యూసర్ మహేంద్రనాథ్ కూండ్ల మాట్లాడుతూ- ఒక సినిమా రిలీజై నెక్ట్స్ వీక్ చూడటం అనేది అరుదు. అలాంటిది 25 రోజులు థియేటర్స్ లో సినిమా రన్ కావడం అంటే ఈజీ కాదు. అలాంటి ఘనత సాధించిన "మయూఖ" టీమ్ ను అభినందిస్తున్నా. ఈ రోజు చిన్న చిత్రాలు థియేటర్స్ లో ఆడటం ఎంత కష్టమైందో మనం చూస్తున్నాం. ఈ టీమ్ ఇలాగే మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటున్నా. అన్నారు.

వీ5 ఎండీ వెంకటేష్ మాట్లాడుతూ - "మయూఖ" సినిమా ప్రీమియర్స్ వేశారు. అప్పుడు సినిమా చూసి ఈ మూవీ పెద్ద సక్సెస్ అవుతుందని చెప్పాను. మేము ఆశించినట్లే "మయూఖ" సినిమాను సూపర్ హిట్ చేసిన ప్రేక్షకులకు థ్యాంక్స్. అన్నారు.

యాక్టర్ దేవ్ డి మాట్లాడుతూ - మా సినిమా సక్సెస్ సెలబ్రేషన్స్ కు మైండ్ బెండింగ్ బ్లాక్ బస్టర్ అని పేరు పెట్టారు. ఇంతకంటే పెద్ద పేరు పెట్టినా మాకు సంతోషమే. కొత్త టీమ్ తో ఇలాంటి డిఫరెంట్ థ్రిల్లర్ నిర్మించిన మా ప్రొడ్యూసర్ గారికి, సినిమాను రూపొందించిన మా డైరెక్టర్ గారికి థ్యాంక్స్. అన్నారు.

హీరోయిన్ పాయల్ చెంగప్ప మాట్లాడుతూ - తెలుగులో నాకు ఇది ఫస్ట్ మూవీ. మా టీమ్ కూడా కొత్త వాళ్లే. ఇలాంటి కొత్త టీమ్ కు పెద్ద సక్సెస్ ఇచ్చిన ఆడియెన్స్ కు థ్యాంక్స్. ఈ రోజు మా సినిమా 25 రోజుల సక్సెస్ సెలబ్రేషన్స్ జరుపుకోవడం సంతోషంగా ఉంది. మా మూవీ రిలీజ్ కు ముందే న్యూయార్క్ ఫిలిం ఫెస్టివల్ లో బెస్ట్ మిస్టరీ మూవీ అవార్డ్ గెల్చుకుంది. మా డైరెక్టర్ కు కూడా అవార్డ్స్ వచ్చాయి. నాకు ఈ చిత్రంలో అవకాశం కల్పించిన మా ప్రొడ్యూసర్, డైరెక్టర్ గారికి థ్యాంక్స్. మీ అందరి సపోర్ట్ వల్లే మేము ఈ విజయాన్ని అందుకోగలిగాం. మీ ఆదరణ ఇలాగే మాకు ఉంటుందని ఆశిస్తున్నాం. అన్నారు.

ప్రొడ్యూసర్ శశిధర్ నల్ల మాట్లాడుతూ - థియేటర్స్ దగ్గర పెద్ద సినిమాలు, భారీ బడ్జెట్ మూవీస్ నిలబడని పరిస్థితి చూస్తున్నాం. అలాంటి పరిస్థితుల్లో మా సినిమా థియేట్రికల్ గా 25 రోజుల సక్సెస్ ఫుల్ గా ప్రదర్శితమవుతుండటం సంతోషంగా ఉంది. మా టీమ్ అందరికీ ఈ విజయం గర్వకారణం. మాది కంటెంట్ ఉన్న సినిమా, తప్పకుండా పెద్ద విజయం సాధిస్తుందని నేను ప్రీ రిలీజ్ ఈవెంట్ లో చెప్పాను. నా మాటను ఆడియెన్స్ నిజం చేశారు. మంచి స్క్రిప్ట్, ప్లానింగ్, కష్టపడే టీమ్ ఉంటే మయూఖ లాంటి విజయం ఏ ప్రొడ్యూసర్ అయినా సాధించవచ్చు. అన్నారు.

డైరెక్టర్ శ్రీతేజ్ ఎస్. కె . మాట్లాడుతూ - నేను హనుమాన్ మాలలో ఉండే ఈ సినిమా ప్రమోషన్స్ చేశాను. ఆయన శక్తే మా సినిమాను ముందుకు నడిపించిందని నమ్ముతున్నాను. మేము ఏదో రన్ చేస్తున్నామని ఈ సినిమాను థియేటర్స్ లో రన్ చేయడం లేదు. నిన్న 25 డే మా టీమ్ థియేటర్స్ కు వెళ్లారు. దాదాపు 50 పర్సెంట్ ఆక్యుపెన్సీ ఉంది. మా మూవీని ప్రేక్షకులు జెన్యూన్ గా ఆదరిస్తున్నారు. ఆడియెన్స్ థియేటర్స్ కు రావడం చూసి నేను ఎమోషనల్ గా సోషల్ మీడియాలో పోస్ట్ కూడా చేశాను. మాది చిన్న సినిమా అని మొదట్లో ఎవరూ పట్టించుకోలేదు. కానీ అభిరుచి గల ఆడియెన్స్ సక్సెస్ చేశారు. నేను స్టోరీ చెప్పినప్పుడు మా ప్రొడ్యూసర్ శశిధర్ గారు బడ్జెట్ ఏంటి, తీయగలడా లేదా అని ఆలోచించలేదు ఓకే మూవీ చేస్తున్నాం అన్నారు. ఆయన నమ్మకాన్ని నేను నిలబెట్టానని నమ్ముతున్నా. అలాగే మా హీరోయిన్ పాయల్ కూడా కథ చెప్పగానే నమ్మి చేశారు. ఈ సక్సెస్ కు కారణమైన మా టీమ్, మీడియా మిత్రులు అందరికీ నా థ్యాంక్స్. అన్నారు.

పొలిటికల్ లీడర్ చిన్న శ్రీశైలం యాదవ్ మాట్లాడుతూ - కంటెంట్ బాగున్న చిన్న సినిమాలను ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తూ వస్తున్నారు. మేము ఎన్నో ఏళ్లుగా చిన్న సినిమాలకు సపోర్ట్ గా నిలుస్తున్నాము. మయూఖ సినిమా 25 రోజుల వేడుక జరుపుకోవడం సంతోషంగా ఉంది. డైరెక్టర్ శ్రీతేజ్, ప్రొడ్యూసర్ శశిధర్ నాకు చాలాకాలంగా తెలుసు. మీ టీమ్ ఇలాగే మరిన్ని విజయాలు సాధించాలి. మీ టీమ్ కు ఏ సహాయం కావాలన్నా నా దగ్గరకు రావొచ్చు. చిన్న చిత్రాలకు ప్రభుత్వం తరుపున కూడా సపోర్ట్ అందేలా చేస్తాం. అన్నారు.

పొలిటికల్ లీడర్ చిన్న శ్రీశైలం యాదవ్, వీ5 ఎండీ వెంకటేష్, ప్రొడ్యూసర్ మహేంద్రనాథ్ కూండ్ల "మయూఖ" టీమ్ కు సక్సెస్ షీల్డ్ లు అందించారు

నటీనటులు - పాయల్ చెంగప్ప, బిగ్ బాస్ ఫేమ్ అమన్ మసూద్, దేవ్ డి, మురళీధర్ గౌడ్, లావణ్య రాణి, చరిశ్మ దబ్బార, జాను వర్మ, నానాజీ కర్రి, రఘు వాసిరెడ్డి, అభిలాష్ అడ్డ, వి.ఎస్. రాజు, మది నస్రీన్, బేబి మాన్వీ, మాస్టర్ షణ్ముఖ చరణ్, శశి కదిరి, రాంబాబు రామిశెట్టి, పవన్ లక్కిరెడ్డి, మణిసాయి, సత్య విఠల్, ప్రశ్వీత చౌదరి నల్లా, వేగి నాయుడు, శ్రీధర్, మణికంఠ

రామాయణ.. ఇంగ్లీష్, ఇండియన్ లాంగ్వేజ్ రన్ టైమ్ ఎంత తేడానో తెలుసా..?

భారతీయ ఇతిహాసం ఆధారంగా నితీష్ తివారీ దర్శకత్వంలో అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న చిత్రం 'రామాయణ: రైజ్ ఆఫ్ ఎ లెజెండ్'. ఇటీవల అమెరికాలోని లాస్ ఏంజెలెస్‌లో అకాడమీ మ్యూజియం ఆఫ్ మోషన్ పిక్చర్స్‌లో ఈ సినిమా ప్రపంచ ఇంగ్లీష్ ప్రీమియర్ ఘనంగా జరిగింది. అయితే ఈ ప్రదర్శన తర్వాత ఇంగ్లీష్ వెర్షన్ మరియు ఇండియన్ లాంగ్వేజ్ వెర్షన్ల రన్ టైమ్ విషయంలో ఒక ఆసక్తికరమైన తేడా బయటకు వచ్చి తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఆ వివరాలు ఇప్పుడు చూద్దాం.. రెండు వెర్షన్ల మధ్య నిడివి వ్యత్యాసం: మేకర్స్ మరియు ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం 'రామాయణ' ఇంగ్లీష్ వెర్షన్ రన్ టైమ్ 2 గంటల 47 నిమిషాలుగా ఉండగా.. హిందీ, తెలుగుతో సహా ఇతర ఇండియన్ లాంగ్వేజ్ వెర్షన్ల నిడివి ఏకంగా 3 గంటల 15 నిమిషాలుగా ఉంది. అంటే ఇంగ్లీష్ వెర్షన్‌తో పోలిస్తే భారతీయ భాషల వెర్షన్ దాదాపు 28 నిమిషాలు ఎక్కువ నిడివితో ప్రేక్షకు ముందుకు రాబోతోంది. ఇక ఈ వ్యత్యాసం వెనుక ప్రొడ్యూసర్ నమిత్ మల్హోత్రా ఒక ప్రత్యేకమైన వ్యూహాన్ని అమలు చేశారు. ంటలవతీబితిబవఎవనిబి పాశ్చాత్య ప్రేక్షకుల కోసం ప్రత్యేక స్క్రిప్ట్: ఈ సినిమా కేవలం డబ్బింగ్ వెర్షన్ మాత్రమే కాదని నిర్మాత స్పష్టం చేశారు. హాలీవుడ్ మరియు వెస్టర్న్ ఆడియన్స్ అభిరుచులకు అనుగుణంగా ఇంగ్లీష్ వెర్షన్ కోసం ప్రత్యేకంగా ఒక సరికొత్త స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారు. ఇక 'లార్డ్ ఆఫ్ ది రింగ్స్', 'గ్లాడియేటర్' వంటి హాలీవుడ్ యాక్షన్ ఎపిక్స్ తరహాలో కథను ఎంతో వేగంగా, ఆసక్తికరంగా నడిపించేలా ఈ ఇంగ్లీష్ కట్‌ను రూపొందించారు. పాటల తొలగింపుతో తగ్గిన నిడివి: ఎఎ భారతీయ సినిమాల్లో కథా ప్రవాహానికి, భావోద్వేగాలకు పాటలు మరియు సుదీర్ఘమైన డ్రామా ఎంతో ముఖ్యం. కానీ ఇంగ్లీష్ వెర్షన్‌లో వెస్టర్న్ ఆడియన్స్ శైలికి తగ్గట్టు పాటలను పూర్తిగా తొలగించారు. ఇక పాటలను తీసివేసి కేవలం కథ, యాక్షన్‌పై మాత్రమే దృష్టి పెట్టడం వల్ల ఇంగ్లీష్ వెర్షన్ నిడివి 25 నుండి 30 నిమిషాలు తగ్గి లీనర్‌గా, ఫాస్ట్‌గా మారింది. అంతర్జాతీయ స్థాయిలో ఏఆర్ రెహమాన్, హాన్స్ జిమ్మర్ మ్యూజిక్: నమిత్ మల్హోత్రా, కేజీఎఫ్ స్టార్ యశ్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్, యశ్, సాయిపల్లవి ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. భారతీయ సంగీత దిగ్గజం ఏఆర్ రెహమాన్ తో పాటు అంతర్జాతీయ ఆస్కార్ విజేత హాన్స్ జిమ్మర్ ఈ సినిమాకు కలిసి సంగీతాన్ని అందిస్తుండటం విశేషం. ఇక తొలి భాగాన్ని 2026 నవంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి చిత్ర బృందం సన్నాహాలు చేస్తోంది. ఇక మొత్తానికి చూస్తే, 'రామాయణ' చిత్రాన్ని గ్లోబల్ లెవెల్‌లో హాలీవుడ్ సినిమాలకు పోటీగా నిలిపేందుకు మేకర్స్ ఇంగ్లీష్, ఇండియన్ వెర్షన్లను వేర్వేరు రన్ టైమ్‌లతో డిజైన్ చేశారు.

హీరోయిన్ క్యారెక్టర్ విషయంలో లెక్కలు తప్పకూడదు మాస్టర్..!



ఒకప్పుడు సుకుమార్ అంటేనే మనకు గుర్తొచ్చేది లాజిక్కులు, లెక్కలు. అందుకే ఆయనను ముద్దుగా లెక్కల మాస్టర్ అని పిలుస్తుంటారు. కథలో ఎన్నో చిక్కులు పెట్టి, వాటిని ఆసక్తికరంగా ప్రేక్షకులకు అర్థమయ్యేలా చెప్పడం ఆయన ప్రత్యేకత. ఒకప్పుడు రాజమౌళి కూడా సుకుమార్.. మాస్ సినిమాల వైపు వస్తే తమ పరిస్థితి ఏమిటని సరదాగా వ్యాఖ్యానించారు. ఆయన క్యారెక్టర్లు అన్నీ కూడా లాజిక్కులతో రాస్తారు. అలాంటి సుకుమార్ హీరోయిన్ క్యారెక్టర్ విషయంలో మాత్రం చాలాసార్లు లెక్కలు తప్పడనే చెప్పాలి. రామ్ చరణ్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్నఆర్‌సి 17 సినిమా.. ఇప్పుడు ఈ విషయంలో ఆసక్తిని పెంచుతోంది. ముఖ్యంగా హీరోయిన్ పాత్రకు ఎంత ప్రాధాన్యత ఇస్తారనే చాలామంది చూస్తున్నారు. అయితే ఇందుకు కారణాలు లేకపోలేదు. రంగస్థలం సినిమా నుంచి సుకుమార్ తెరకెక్కించిన కొన్ని సినిమాల్లో హీరోయిన్ పాత్రలపై నెగిటివ్ కామెంట్లు వచ్చాయి. మహిళా పాత్రలను చూపించే విధానంపై కొన్ని సందర్భాల్లో విమర్శలు కూడా వచ్చాయి. అంతేకాకుండా ఆయన శిష్యుల సినిమాల్లో కూడా ఇదే విషయం చాలా వివాదాలకు దారితీసింది. రామ్ చరణ్ నటించిన బుచ్చిబాబు సానా పెద్ది సినిమాలో జాన్వి కపూర్ పాత్ర పై ఎన్ని విమర్శలు వచ్చాయో తెలిసిన విషయమే. అలాగే శ్రీకాంత్ ఓదెల ది పారడైజ్ సినిమాలో హీరోయిన్ క్యారెక్టర్ పైన కూడా ఎన్నో నెగటివ్ కామెంట్స్ వచ్చాయి. మొత్తానికి సుకుమార్ శిష్యులు ఇద్దరు తెరకెక్కించిన రెండు చిత్రాల పైన ఈ మధ్య పెద్ద దుమారమే రేగింది. ఇలాంటి పరిస్థితుల్లో ఆర్‌సి 17 విషయంలో సుకుమార్ మరింత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. హీరో పాత్రకు ఎంత ప్రాధాన్యత ఇస్తారో, హీరోయిన్ పాత్రకు కూడా అంతే గౌరవం, ప్రాధాన్యత ఇవ్వాలి. ఇప్పటివరకు కొన్ని సినిమాల్లో హీరోయిన్ పాత్రల విషయంలో లెక్కలు తప్పినా పెద్దగా పట్టించుకోకపోవచ్చు. కానీ ఇప్పుడు సోషల్ మీడియా కాలంలో చిన్న తప్పు కూడా పెద్ద ఎత్తున దుమారం రేపుతుంది. కాబట్టి ఈసారి ఈ పాత్రలో చిన్న తప్పులు జరిగినా.. ఈసారి లెక్కల మాస్టర్.. హీరోయిన్ సబ్జెక్టులో పూర్తిగా ఫెయిల్ అయినట్టే అవుతుంది. అందుకే ఆర్‌సి 17 విషయంలో హీరోయిన్ క్యారెక్టర్ లెక్కలు మాత్రం తప్పకూడదు మాస్టర్. ఈ పాత్రను సరిగ్గా తీర్చిదిద్దితే సినిమాకు మంచి పేరు వస్తుంది. అదే విషయంలో పొరపాటు జరిగితే మాత్రం సుకుమార్ ప్రతిష్టపై కూడా ప్రభావం పడే అవకాశం ఉంది. ఈ విషయాన్ని జాగ్రత్తగా గమనించుకొని.. సుకుమార్ ఈ సినిమా కథలో హీరోయిన్ క్యారెక్టర్ రాసుకోవడం మంచిది.

Edited, Printed, Published and Owned by NASREEN KHAN , Printed at M/s DATTASAI GRAPHICS :1-1-651/8, Gandhi Nagar, Hyderabad-500 080
Published from H.No.1-7-137, Flat 402, Vijaysai Apartments, Zamistanpur, Musheerabad, Hyderabad- 20, (Telangana) Editor:Nasreen Khan, Ph : 040-27602786, Cell : 965243981 .R.N.I.No.TELTEL/2013/51844